పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అదనపు ఎస్పీ వెంకటాద్రి



పొట్టి శ్రీరాములును గౌరవించడం మనందరి బాధ్యత

● జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) ఎం.వెంకటాద్రి

రాయచోటిటౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణ త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములును గౌరవించుకోవడం మనందరి బాధ్యత అని జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి పేర్కొన్నారు. ఆదివారం ఆయన ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదేశాల మేరకు జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో అమరజీవి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు సేవలు మరువలేనివని, వారి ఆశయాలను, సేవలను ప్రతిఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల సాధన కోసం అమరణ దీక్ష చేపట్టి ప్రాణాలను అర్పించి అమరజీవిగా నిలిచిన మహనీయుడన్నారు. స్వాతంత్ర్య సంగ్రామంలో గాంధీ వెంట నడిచి, సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొని జైలుశిక్ష కూడా అనుభవించారన్నారు. అటువంటి మహనీయుడిని స్మరించుకోవడం, నివాళులర్పించడం మనందరి బాధ్యతని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ పెద్దయ్య, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆలస్యంగా నడిచిన ఎక్స్‌ప్రెస్ రైలు

ములకలచెరువు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నుంచి ములకలచెరువు మీదుగా తిరుపతికి నడిచే సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు ఆదివారం ఆలస్యంగా నడిచింది. సాంకేతిక కారణాలతో రైలు సికింద్రాబాద్ జంక్షన్‌లో ఆలస్యంగా బయలుదేరింది. దీంతో ములకలచెరువుకు తెల్లవారుజామున 2.49 గంటలకు రావాల్సిన రైలు 5.20కు చేరుకుంది. రెండున్నర గంటలకు పైగా ఆలస్యంగా రావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అలాగే మదనపల్లెకు ఉదయం 6.03కు, కలికిరికి 6.30కు, పీలేరుకు 6.48 గంటలకు వచ్చింది. తిరుపతికి ఉదయం 6.25 గంటలకు చేరాల్సిన రైలు ఉదయం 8.30 గంటలకు వెళ్లింది.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

● కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి(కలెక్టరేట్), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు ఈ నెల 16న సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రం రాయచోటితో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

దేవుళ్లకే.. శఠగోపం..!

● బి.కొత్తకోటలో ఆలయాల ఆస్తులతో బంతాట
● భూముల లీజు పేరుతో రూ.కోట్ల ఇసుక దోపిడీ
● లీజు వేలమే లేకుండా భూముల అన్యాక్రాంతం



బి.కొత్తకోట పట్టణంలోని చౌళేశ్వరస్వామి ఆలయం



నలగంగమ్మ మాన్యంలో ఏర్పాటు చేసుకున్న ఇటుక బట్టీలు

బి.కొత్తకోట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అక్కడ దేవుళ్లకే శఠగోపం పెడుతున్నారు. దేవుళ్ల ఆస్తులతో బంతాట ఆడుకుంటూ ఆదాయాన్ని పక్కదారి పట్టిస్తున్నారు. మాన్యం ఆస్తులను కాపాడి మంచిపేరు తెచ్చుకుందామనే దేవదాయ అధికారి లేకపోవడం ప్రధాన లోపమైతే... దేవుడి మాన్యం అయితే మాకేంటి ? అప్పనంగా ఏళ్ల తరబడి అనుభవించుకుందాం.. భూమిలో ఇసుకను టన్నుల కొద్దీ తోడేసి కోట్లు కొల్లగొట్టేద్దాం అనుకున్న వారు మరికొందరు. ఈ వ్యవహారం కొత్తేమీ కాదు. ఏళ్ల తరబడి నడుస్తున్నా, వాటిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాథుడే లేరని స్థానికులు అంటున్నారు.

ఆలయాలకు రూ.కోట్ల విలువైన భూములు

బి.కొత్తకోట పట్టణంలో చౌళేశ్వరస్వామి, ఆంజనేయస్వామి, చెన్నకేశవస్వామి, నల్లగంగమ్మ ఆలయాలకు పట్టణ నడిబొడ్డున, పట్టణ శివారులలో వంద ఎకరాలకు పైగా భూములు ఉన్నాయి. వీటిలో ఎకరం రూ.పది లక్షల నుంచి రూ.10 కోట్ల విలువైన భూములు సైతం ఉన్నాయి. దేవదాయశాఖ పరిధిలో ఉన్న ఈ ఆలయాల భూముల రక్షణ, భూముల ద్వారా వచ్చే ఆదాయం చూసుకోవాల్సిన బాధ్యత ఇక్కడ దేవదాయశాఖ నియమించిన ఈవోదే. అయితే ఇక్కడ పనిచేస్తున్న అధికారి బాధ్యతారాహిత్యం, స్వార్థం, నిర్లక్ష్యం కారణంగా ఈ భూముల ద్వారా ఆయా ఆలయాలకు రావాల్సిన ఆదాయం రాకపోగా, కొంతభూమి ధ్వంసమై తన స్వరూపమే కోల్పోయి పనికి రాకుండాపోయిందని పలువురు ఆరోపిస్తున్నారు. రూ.కోట్ల విలువైన ఇసుక దేవుడి మాన్యం భూమిలోంచే తరలిపోయిందని స్థానికులు చెబుతున్నారు.

మాన్యం భూములంటే అలుసా?

మాన్యం భూములంటే అలుసా అంటే.. బి.కొత్తకోటలో అవుననే అనిపిస్తోంది. కొన్నిచోట్ల అధికారుల చేతివాటం ఉంటే, మరికొన్ని చోట్ల స్వార్థపరుల పనితనం కనిపిస్తోంది. బెంగళూరు రోడ్డులోని నల్లగంగమ్మ మాన్యం సర్వే నెంబరు 326, 328లలో 9 ఎకరాలుండగా ఇందులో పదుల సంఖ్యలో ఇటుక బట్టీలు, నర్సరీలు, గ్రానైట్ దుకాణాలు ఉన్నాయి. వీటికి ప్రతియేటా లీజువేలం నిర్వహించకుండా ఈవో అనధికారికంగా డబ్బు వసూలు చేసుకుంటూ రసీదులు ఇవ్వడం లేదన్న ఆరోపణలున్నాయి. పట్టణ శివారులో ఐదేళ్ల కాలపరిమితితో వేలం పాటలో భూములను పాడుకున్న రైతులకు తమకు కేటాయించిన భూమి ఎక్కడుందో ఇప్పటికీ చూపలేదు. ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా తాత్కాలిక బస్టాండుగా వాడుతున్న స్థలంలో దుకాణదారులకు అనుమతులపై స్పష్టత లేదు.

భూములే మార్చేశారు..

దిగువ బస్టాండులో ఉన్న చెన్నకేశవస్వామి ఆలయానికి చెందిన భూమి ఖాతా నెంబరు 798 ప్రకారం ఎండోమెంటు ఈవో పేరున 33 ఎకరాలకు పైగా ఉంది. ఈ భూమిని ఇదే పట్టణంలోని బీసీ కాలనీలో ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయం పేరున మార్చేశారు. ఇలా ఎవరు చేశారు? ఎందుకు చేశారు? అనే ప్రశ్నలకు సమాధానం చెప్పేవారు లేరు. ఇందులో సర్వేనెంబర్ 627లో 8.13 ఎకరాలు, 836-1లో 2.81 ఎకరాలు, 1840లో 11.22 ఎకరాలు, 1842-2లో 1.31 ఎకరాలు, 1847-1లో 0.6 ఎకరాల భూమి మాత్రమే ఆన్‌లైన్‌లో ఉండగా వివిధ సర్వే నెంబర్లలోని 10.29 ఎకరాల భూమి ఆన్‌లైన్‌లోనే లేదు. ఈ భూమి ఎవరి ఖాతా నెంబర్‌లోకి వెళ్లిందో తెలియదు. పట్టణంలో భూములు రూ.కోట్లు పలుకుతున్నాయి. ఏ కబ్జాదారుడి చేతిలోకి వెళ్లిందో తెలియడం లేదు.

15 ఏళ్లుగా లీజు వేలం లేదట

పట్టణ శివారులో ఉన్న మాన్యం భూముల్లో కొన్నింటిని పదిహేనేళ్లుగా లీజు వేలం పాటలే నిర్వహించకుండా ఉన్నట్లు తెలుస్తోంది. అయినా ఈ భూములను కొందరు అనుభవించుకోవడం విమర్శలకు తావిస్తోంది. సర్వేనెంబర్ 1711లో 1.25 ఎకరాలు, బడికాయలపల్లి రోడ్డు 276లో 1.00, పీటీఎం రోడ్డు వైపు 1836లో 2.85, 1842లో 1.32 తదితర భూములకు వేలం పాటలే నిర్వహించడం లేదనే ఆరోపణలున్నాయి. ఇలాంటి అనేక తప్పిదాలపై విచారణ చేయాలంటూ ఫిర్యాదులు వెళ్లాయి. వివిధ ఆరోపణలతో పాటు 1726-1, 1840లో జరిగిన అక్రమాలపై విచారించాల్సి ఉంది. అయినా ఇంతవరకు అతీగతీ లేదు.

మాన్యం భూముల అక్రమాలు తేలుస్తాం..

బి.కొత్తకోటలోని దేవదాయశాఖ భూముల్లో అక్రమాల విషయమై రాష్ట్ర కమిషనర్‌కు రిపోర్టు చేశాను. దీనిపై కర్నూలు జిల్లా, ఆర్ఎస్ రంగాపురం, మద్దిలేటి నరసింహస్వామి ఆలయ డిప్యూటీ కమిషనర్ రామాంజనేయులును విచారణాధికారిగా నియమించారు. త్వరలో బి.కొత్తకోటకు వచ్చి క్షేత్రస్థాయిలో విచారణ చేస్తాం. అక్రమార్కులపై తగిన చర్యలు తీసుకుంటాము.

- విశ్వనాథ్, జిల్లా దేవదాయశాఖ అధికారి

ఆలేటివాగు ఒడ్డున వేలం వేయని మాన్యం భూములు



సాగు కోసం లీజుకు తీసుకొని ఇసుక తోడేసిన మాన్యం భూమి



ఆన్‌లైన్ బెట్టింగులతో యువకుడు బలి

● ఉరేసుకుని బలవన్మరణం



మహేశ్ మృతదేహం

తంబళ్లపల్లె, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ బెట్టింగులకు అలవాటు పడి, చేసిన అప్పులు తీర్చలేక మనోవేదనకు గురైన ఓ యువకుడు ఇంట్లో ఉరేసుకుని బలవన్మరణం చెందాడు. ఈ విషాదకర సంఘటన తంబళ్లపల్లె మండలంలో ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. కుటుంబీకులు, పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కొటాల పంచాయతీ ఎగువ బోయపల్లెకు చెందిన నరసింహులు కుమారుడు మహేశ్(28) టెంపో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా ఆన్‌లైన్ గేమ్‌లు ఆడి సుమారు రూ.15 లక్షల వరకు డబ్బు పోగొట్టుకున్నాడు. దీంతో స్థానికంగా చేసిన అప్పులు తీర్చలేక మనోవేదనకు గురై ఇంట్లోనే ఉరేసుకుని మృతి చెందాడు. సమాచారం అందడంతో ఎస్ఐ లోకేశ్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె జిల్లా వైద్యశాలకు తరలించారు. కాగా, మహేష్‌కు భార్య ప్రత్యూష, ఏడాదిన్నర వయసున్న కుమార్తె శశిర ఉన్నారు. మహేశ్ మృతితో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కుటుంబ పెద్దగా అందరినీ పోషించాల్సిన వ్యక్తి ఆకస్మిక మృతితో కుటుంబం తల్లడిల్లింది. ప్రభుత్వం ఆ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

జనసంద్రమైన జ్యోతి క్షేత్రం

7

● ముగిసిన కాశినాయన ఆరాధనోత్సవాలు
● జ్యోతి దర్శనంతో పులకించిన భక్తులు
● కన్నుల పండువగా సాగిన రథోత్సవం



అర్ధరాత్రి కాశినాయన రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

వందశాతం ఉత్తీర్ణతకు నిరంతరం కృషి

● ఇంటర్మీడియట్ విద్యాశాఖ జిల్లా అధికారి కృష్ణయ్య



రాయచోటిటౌన్, డిసెంబరు15 (ఆంధ్రజ్యోతి): మార్చి నెలలో జరగబోయే ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలో జిల్లాలోని అన్ని కళాశాలల్లో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు అన్ని రకాలుగా కృషి చేస్తున్నామని ఇంటర్మీడియట్ విద్యాశాఖ జిల్లాఅధికారి కృష్ణయ్య పేర్కొన్నారు.

ప్రశ్న: జిల్లాలో మొత్తం ఎన్ని కళాశాలలు ఉన్నాయి ?

జవాబు: జిల్లాలో ప్రభుత్వ, ఏపీఆర్‌జేసీ, హైస్కూల్ ప్లస్, కేజీబీవీ, ఎయిడెడ్, ప్రైవేట్, సోషల్ వెల్ఫేర్, ఒకేషనల్ కళాశాలలతో కలిసి మొత్తం 152 జూనియర్ కళాశాలలు ఉన్నాయి.

ప్రశ్న: జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎంత ?

జవాబు: జిల్లా వ్యాప్తంగా 152 జూనియర్ కళాశాలల్లో ప్రథమ సంవత్సరంలో 15,356 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరంలో 14,248 మందితో కలిసి మొత్తం 29,604 మంది విద్యార్థులు చదువుతున్నారు.

ప్రశ్న: ఉత్తీర్ణత శాతం పెంచేందుకు చేపడుతున్న చర్యలు ?

జవాబు: జూనియర్ కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ఉదయం అరగంట, సాయంత్రం ఒక గంటపాటు స్పెషల్ క్లాసులు నిర్వహిస్తున్నాం. వెనకబడిన విద్యార్థులపై ఫోకస్ పెడుతున్నాం. ప్రభుత్వం నుంచి సరఫరా అవుతున్న స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు ఇచ్చి ఉత్తీర్ణత సాధించే దిశగా బోధన చేపడుతున్నాం.

ప్రశ్న: గతేడాది జిల్లాలో ఎంత శాతం ఉత్తీర్ణత సాధించింది ?

జవాబు: ఇంటర్మీడియట్ ఫలితాల్లో జిల్లా 62 శాతం సాధించింది. త్వరలో జరగబోయే పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో ఈ విద్యా సంవత్సరం 95-100 శాతం ఉత్తీర్ణత దిశగా ప్రత్యేక బోధన చేపడుతున్నాం.

ప్రశ్న: సంకల్ప-2025 కళాశాలలో అమలు చేస్తున్నారా...?

జవాబు: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటికే సంకల్ప-2025ను అన్ని కళాశాలల్లో అమలు చేస్తున్నాం. ఈ పథకం కింద విద్యార్థులను ఏ, బీ, సీ కేటగిరీలుగా విభజించి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ వారికి అవసరమైన మెటీరియల్ అందజేస్తున్నాం. సీ కేటగిరీ విద్యార్థులు బీ కేటగిరీలోకి, బీ కేటగిరిలోని విద్యార్థులు ఏ కేటగిరీలోకి వచ్చే విధంగా విద్యాబోధన చేపడతాం. అధ్యాపకులు వారిని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నారు. రాబోవు విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్య మరింతగా పెంచడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం.

వైసీపీ బియ్యపు బండ్లు.. ఇంకెన్నాళ్లు..?

● జగన్ బొమ్మ తొలగించరా..?
● ప్రభుత్వం మారినా.. పట్టించుకొనేవారు లేరు
● తూకాల్లో వ్యత్యాసం
● మిగిలినవన్నీ బ్లాక్ మార్కెట్‌కు



గత ప్రభుత్వంపై విసుగు చెందిన ఓటర్లు కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టారు. 151 సీట్లు గెలిచామని విర్రవీగిన ఆ పార్టీని 11 సీట్లకు పరిమితం చేశారు. దీన్నిబట్టి గత ప్రభుత్వంపై ఎంత వ్యతిరేకత వచ్చిందో అర్థం చేసుకోవచ్చు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 6 నెలలవుతున్నా రేషన్ వాహనాలపై జగన్ బొమ్మ మాత్రం తొలగించడం లేదు. ఊరూరా దర్జాగా తిరుగుతూ రేషన్ పంపిణీ చేస్తున్నారు. ఇదేమని ఎవరైనా అడిగితే 'మేము జగన్ బొమ్మ తొలగించం.. ఏం చేసుకుంటారో చేసుకోపోండి' అంటున్నారు. ఇక తూకాల్లో వినియోగదారులను మోసం చేస్తూ బ్లాక్ మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. మరి.. ఇంత జరుగుతున్నా కూటమి ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని పలువురు చర్చించుకుంటున్నారు.

గాలివీడు, డిసెంబరు 15: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వ పాలన లో అనేక మార్పులు తీసుకొచ్చారు. అందులో భాగంగా రేషన్‌షాపుల డీలర్లను మార్చినా.. వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన బియ్యపు బండ్లు మాత్రం యథావిధిగా కొనసాగుతున్నాయి. కానీ ఆ వాహనాలపై జగన్ బొమ్మ ఉండడంతో కొందరు అభ్యంతరం తెలుపుతున్నారు. ప్రభుత్వం మారినా గత సీఎం ఫొటో మార్చరా అంటూ మండిపడుతున్నారు. మండలంలోని 17 పంచాయతీల్లో 39 రేషన్‌షాపులు కలవు. ఈ రేషన్ షాపుల నుంచి ఇంటింటికి బియ్యాన్ని పంపిణీ చేయడానికి గత ప్రభుత్వం వాహనాలను ఏర్పాటు చేసింది. ఒక్కో వాహనం రెండు నుంచి మూడు రేషన్ షాపుల పరిధిలోని ప్రజలకు బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు. ప్రతి నెల 30వ తేదీలోగా స్టాక్ పాయింట్ నుంచి గ్రామాల్లోని రేషన్ షాపులకు బియ్యం, కందిబేడలు, చక్కెర వంటి వస్తువులు చేరుతున్నాయి. ప్రతి నెల 1వ తేది నుంచి రేషన్ పంపిణీ జరుగుతోంది. బియ్యం బండ్ల వారు రేషన్ షాపుల నుంచి బియ్యాన్ని తీసుకొని పల్లెల్లోని ప్రజలకు పంపిణీ చేయాల్సి ఉంది. అయితే చాలా మంది వాహనాల్లో రేషన్ షాపుల నుంచి బియ్యాన్ని తీసుకొని వెళ్తున్నారే కానీ ప్రజలకు పంపిణీ చేసేటప్పుడు తూకం తక్కువగా ఇస్తున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. కొంత మంది బియ్యపు వాహనదారులు కంది బేడలను, చక్కెరలను ప్రభుత్వం నిర్ణయించిన ధరకు కాకుండా అధిక ధరలకు అమ్ముతున్నట్లు ఆరోపణలు కలవు. కంది బేడలు ఒక కేజీ రూ.66 అమ్మాల్సి ఉండగా రూ.80 కు, చెక్కెర ఒక కేజీ రూ.17కు అమ్మాల్సి ఉండగా రూ.23కు అమ్ముతున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. గత టీడీపీ హయాంలో రేషన్ షాపుల దగ్గరకు ప్రజలు వచ్చి వివిధ రకాల సరుకులను తీసుకెళ్లే వారు. అప్పుడు తూకాల్లో, రేట్లలో ఎలాంటి వ్యత్యాసాలు లేవని ప్రజలు చెబుతున్నారు. ప్రస్తుతం బండ్లు ఎప్పుడు వస్తాయో .. ఎప్పుడు బియ్యం ఇస్తారో.. తెలియడం లేదు. వాటి కోసం రోజుల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయంటున్నారు.

వాహనదారుల దురుసు

మండలంలో బియ్యపు వాహనాలకు జగన్ బొమ్మలు అలాగే ఉన్నాయి. బోరెడ్డిగారిపల్లెకు పంపిణీ చేస్తున్న బియ్యపు వాహనానికి జగన్ బొమ్మ ఉండడంతో ఆ విషయాన్ని అక్కడి ప్రజలు గత సోమవారం వాహనదారున్ని ప్రశ్నించగా తాను జగన్ బొమ్మను తొలగించనని, ఎవరికీ చెప్పుకుంటారో చెప్పుకోండి అని ప్రజల పట్ల దురుసుగా ప్రవర్తించినట్లు గ్రామ ప్రజలు ఆరోపించారు. ఈ విషయాన్ని తహసీల్దార్‌కు కూడా ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. అలాగే చీమలచెరువుపల్లె పంచాయతీ కొన్ని పల్లెలకు ఇంటర్నెట్ సౌకర్యం లేనందున ఇక్కడ బియ్యపు బండ్ల వారు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. లబ్ధిదారులకు ఇవ్వాల్సిన రేషన్ సరుకులను వారికి ఇవ్వకుండా, ఇచ్చినట్లు రాసుకొని మిగిలిన సరుకులను బ్లాక్ మార్కెట్‌లో అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారని ప్రజలతో పాటు డీలర్లు కూడా ఆరోపిస్తున్నారు. ప్రతి నెల 30 నుంచి 50 మందికి బియ్యం ఇవ్వకుండా వాహనదారులు మోసం చేస్తున్నారని వారు తెలిపారు. మిగిలిన బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌లో అమ్ముతున్నట్లు ప్రజలు ఆరోపించారు. మొత్తం వాహనాలన్నీ వైసీపీ అనుచరులవే కావడంతో ప్రభుత్వ పథకాల గురించి వ్యతిరేకంగా ప్రజలకు తెలియజేస్తున్నారని మరికొందరు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వాహనాలను స్వాధీనం చేసుకొని జగన్ బొమ్మలు తొలగించాలని పలువురు కోరుతున్నారు.

మా దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటాం..

బియ్యం పంపిణీ చేసే వాహనదారులు అక్రమాలకు పాల్పడినట్లు మా దృష్టికి వస్తే ఖచ్చితంగా వారిపై కఠిన చర్యలు తీసుకుంటాము. తక్కువ తూకం ఇచ్చినా, అధిక రేట్లకు కందిపప్పు, చక్కెరను అమ్మినా చర్యలు తప్పవు. ఇప్పటికే చాలా వాహనాలకు జగన్ బొమ్మను తొలగించాం. ఎక్కడైనా జగన్ బొమ్మ ఉన్నట్లయితే వాటిని కూడా తొలగిస్తాము.

- భాగ్యలత, తహసీల్దార్, గాలివీడు

ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొస్తున్నారు..



బియ్యపు బండ్ల వారు మా గ్రామంలో బియ్యాన్ని, చక్కెరను, కందిబేడలను సక్రమంగా పంపిణీ చేయడం లేదు. రేషన్‌షాపుల దగ్గర నుంచి కొలతలు పట్టి తీసుకొని వెళుతున్నారు. కానీ ప్రజలకు ఇచ్చేటప్పుడు తక్కువ ఇచ్చి మోసం చేస్తున్నారు. కందిబేడలు, చక్కెరను అధిక రేట్లకు విక్రయిస్తున్నారు. ప్రతి నెల కనీసం రెండు, మూడు క్వింటాళ్లు స్వాహా చేస్తున్నారు.

- గురునాథ్‌రెడ్డి, చీమలచెరువుపల్లె, తాత్కాలిక డీలరు

జాతీయ లోక్ అదాలత్‌లో ఉమ్మడి జిల్లాకు 7వ ర్యాంకు

● 7538 కేసులు పరిష్కారం
● రూ.30,62,35,148లు చెల్లింపు ● జిల్లా ప్రధాన జడ్జి శ్రీదేవి

వివరాలు...... 7లో

యూసీఐఎల్ ఉద్యోగి కాలువలో పడి గల్లంతు

● గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు

వివరాలు...... 7లో



జన్ ఔషధీ మందుల షాపు

జన్ ఔషధీలో... చౌక ధరలకే మందులు

- డీసీఎంఎస్ ఆధ్వర్యంలో నిర్వహణ
- ప్రజల్లో అపోహలు తొలగించేందుకు కసరత్తు
- వినియోగదారులను ఆకర్షించేందుకు యత్నం

కడప ఎన్టీఆర్ సర్కిల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తక్కువ ధరలకే ఔషధాలు అందించేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. ప్రస్తుత కాలంలో ఎక్కువ శాతం మంది ఏదోక జబ్బుతో బాధపడుతూ మందులు వాడాల్సిన పరిస్థితి. దీంతో మందుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ప్రతి ఒక్కరి సంపాదనలో అధికభాగం మెరుగైన ఆరోగ్యం కోసం ఖర్చు చేయాల్సి వస్తుంది. దీంతో సామాన్యుల, పేదల పరిస్థితి దారుణంగా తయారవుతోంది. ఆసుపత్రికి వెళ్లాలంటే అప్పు చేయాల్సిన పరిస్థితి. ఈక్రమంలో ప్రభుత్వాలు ఔషధాల ధరలను తగ్గించి కొంతవరకైనా వెసులుబాటు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాయి. ఇందులో భాగంగానే జనరిక్ ఔషధ కేంద్రాలను గత కొన్ని సంవత్సరాలుగా నిర్వహిస్తున్నారు. అయితే వీటికి తగినంత ఆదరణ లేకపోవడంతో కొంతకాలానికి మూతపడాల్సిన పరిస్థితి నెలకొంది. అయినప్పటికి జిల్లాలో జనరిక్ మందుల షాపుల కేంద్రాలు నడుస్తున్నాయి. ప్రస్తుత ప్రభుత్వాలు జనరిక్ మం దుల షాపుల కేంద్రాలను ప్రోత్సహిస్తున్నాయి. జన్ ఔషధీ పేరుతో కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాయి. ఈ షాపుల ద్వారా దాదాపు 70 నుంచి 80శాతం వరకు కొనుగోలు చేసే మందులపై రాయితీ లస్తుంది.

డీసీఎంఎస్ ఆధ్వర్యంలో

వ్యవసాయంలో రైతులు సాగుచేస్తున్న పంటలను ఆశించే చీడ,పీడ పురుగుల నివారణకు మందులను అందించే ఉద్దేశ్యంతో ఏర్పాటైన జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో జన ఔషధ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇంతకుముందే రైతులకు సేవలు అందిస్తున్న సహకార మార్కెటింగ్ సొసైటీతో పాటు సహకార సొసైటీ ఆధ్వర్యంలో జన్ ఔషధీ కేంద్రాల ఏర్పాటుకు సహకార శాఖ చర్యలు తీసుకుంది. అయితే పెండ్లిమర్రి మండలంలోని వెల్లటూరులో గత కొంతకాలం క్రితం ఏర్పాటు చేసిన జన్ ఔషధీ కేంద్రం నష్టాల్లో నడుస్తుండడంతో మూత వేశారు. దీంతో గత ఏడాది జూలైలో ఏర్పాటు చేయాల్సిన జన్ఔషధీ కేంద్రాన్ని డీసీఎంఎస్ తాత్కాలికంగా వాయిదా వేస్తూ వచ్చింది. ఇప్పటి వరకు రైతులకు అవసరమైన ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు అందిస్తూ వస్తున్న డీసీఎంఎస్ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన రైతు భరోసా కేంద్రాల వల్ల వ్యాపారాలు లేకుండా పోయాయి. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయం వల్ల తమకు వ్యాపారం వస్తుందని ఆశించిన డీసీఎంఎస్ సంస్థకు కొంతకాలం నిరాశమిగిలింది. ఎట్టకేలకు గత నెలలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో జన్ ఔషధీ కేంద్రం ప్రారంభానికి నోచుకుంది. ఈ క్రమంలో తమ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జన్ఔషధీ కేంద్రాన్ని బలోపేతం చేసేందుకు డీసీఎంఎస్ అధికార యంత్రాంగా ఆలోచనలు చేస్తోంది. రాబోవు రోజుల్లో జన్ ఔషధీ కేంద్రాల్లో లభించే మందులు సాధారణంగా బయట లభించే మందులతో సమానమేనని... తగినంత ప్రచారం చేపట్టి ముందుకు సాగేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

అవగాహన లేకపోవడమే.

జనరిక్ షాపుల్లో లభించే మందులపై ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడంతోనే వాటి మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది. 2012లోనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అన్న సంజీవిని పేరుతో జనరిక్ మందుల దుకాణాలు ఏర్పాటయ్యాయి. జిల్లాలో 18షాపులను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వీటి నిర్వహణ బాధ్యతలను మహిళా సమైఖ్యలకు అప్పగించడం జరిగింది. వాటిని వెలుగు సిబ్బంది పర్యవేక్షించేవారు. కాలక్రమంలో తగిన ఆదరణ లేకపోవడంతో నష్టాలు రావడం మొదలైంది. దీంతో కొంతకాలానికి వీటిని మూసివేశారు. అయినప్పటికి కొన్నిచోట్ల మహిళా సంఘాల ప్రతినిధులు ఈ షాపులను స్వాధీనం చేసుకొని సొంతంగా నిర్వహిస్తున్నారు. జనరిక్పై ప్రజల్లో అవగాహన లేకపోవడం... డాక్టర్లు కూడా ఆ మందులను చీటీలలో రాయకపోవడంతో జనరిక్ కేంద్రాలకు ఆదరణ తగ్గింది. వాస్తవానికి జనరిక్ షాపుల్లో లభించే మందులు నాణ్యమైనవే. గతంలో ఒక కంపెనీ తాము తయారు చేసే మందులపై పూర్తి హక్కు కలిగి ఉంటుంది. ఈ హక్కుకు కొంత గడువు ఉంటుంది. ఆ గడువు ముగిసిన తర్వాత అదే మందును తక్కువ ధరకు విక్రయించే అవకాశం ఉంటుంది. దీంతో జనరిక్ షాపుల్లో తక్కువ ధరకే మందులు లభిస్తున్నాయి. బయట ప్రముఖ కంపెనీలు తయారు చేసే మందులు ధరలతో పోలిస్తే ఈ మందుల ధర తక్కువగా ఉండడంతో నాణ్యత


జన్ ఔషధీ కేంద్రంలో ఫార్మాసిస్ట్

ఉండకపోవచ్చు అనే అపోహ, అనుమానం ప్రజల్లో వ్యక్తమవుతోంది. ఈ కారణం చేతనే జనరిక్ షాపుల్లో లభించే మందులు కొనుగోళ్లకు వినియోగదారులు వెనకడుగు వేస్తున్నారు. ఈక్రమంలో ప్రభుత్వాలు ప్రజల్లో అవగాహన తీసుకొచ్చేందుకు ప్రత్యేక కార్యక్రమాల ద్వారా చర్యలు తీసుకుంటే తప్ప జనరిక్ మందుల షాపుల నిర్వహణ కొనసాగే పరిస్థితి కనిపించడం లేదు.

వినియోగదారులను ఆకర్షించే ప్రయత్నం

జనరిక్ ఔషధీ కేంద్రంలో వ్యాపారం మొదలైంది. జనరిక మందులపై ప్రజల్లో అవగాహన తీసుకువచ్చి వారిని ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నాం. మరిన్ని రకాలైన బ్రాండ్లు తెప్పించి ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నాం. పరిచయమున్న వైద్యుల సహకారంతో వినియోగదారుల సంఖ్యను పెంచడం కోసం ప్రయత్నం చేస్తున్నాం.

-ఖాదర్‌వల్లి, ఇన్‌చార్జి బిజినెస్ మేనేజర్, డీసీఎంఎస్.

పులిపిరికి అరుదైన చికిత్స

▸ ఆకుపసరుతో నిమిషాల్లో తొలగింపు


పులిపిర్లపై చికిత్స చేస్తున్న దృశ్యం

కడప జిల్లా : డిసెంబర్ 15: పులిపిర్లకు వడియార మల్లికార్జున అరుదైన చికిత్స నందిస్తున్నారు. ఆకుపసరుతో నిమిషాల్లో శరీరంపై ఉన్న పులిపిర్లు తొలగిస్తామంటున్నారు. కడప జిల్లా, కొత్త బస్‌స్టాండ్ ప్రక్కన ఎస్.పి.బంగ్లా ఎదురుగా, హరిత హోటల్, ఎపి టూరిజం కడప నందు ఆయన పులిపిర్లకు చికిత్స అందిస్తున్నారు. ఈ నెల 15, 16, 17 తేదీల్లో మూడు రోజుల పాటు వాటికి చికిత్స అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా ఆదివారం పలువురికి పులిపిర్లు తొలగించారు. సాధారణంగా మనిషిలో 7 రకాలుగా ఈ పులిపిర్లు కనిపిస్తాయన్నారు. ఏ రకమైన పులిపిరినైనా సరే తాము సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది తక్షణమే తొలగిస్తామన్నారు. అనంతరం అదే పొడి మళ్లీ పులిపిరి తొలగించిన ప్రదేశంలో అద్దుతామన్నారు. సోమ, మంగళవారం రెండు రోజుల్లో మాత్రమే వైద్యం అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. 9849628485 నెంబర్లులోని సంప్రదించాలన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో ఉమ్మడి జిల్లాకు 7వ ర్యాంకు

- 7538 కేసులు పరిష్కారం
- రూ.30,62,35,148లు చెల్లింపు
- జిల్లా ప్రధాన జడ్జి గల్లా శ్రీదేవి

కడప రూరల్, డిసెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు ఈనెల 14న శనివారం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో కడప జిల్లాకు 7వ ర్యాంకు దక్కిందని డీఎల్ఎస్ఏ చైర్మన్, జిల్లా ప్రధాన జడ్జి గల్లా శ్రీదేవి తెలిపారు. ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా ఆయా కోర్టులలో 22 బెంచ్‌లను ఏర్పాటు చేసి మొత్తం 7538 కేసులు పరిష్కరించామన్నారు. ఇందులో 7104 క్రిమినల్ కేసులు, 262 సివిల్ కేసులు, 172 ప్రీలిటిగేషన్ కేసులను పరిష్కరించినట్లు తెలిపారు. వీటిలో కడపలో 2689 కేసులు, ప్రొద్దుటూరులో 1839, రాజంపేటలో 512, రాయచోటిలో 130, బద్వేల్‌లో 253, జమ్మలమడుగులో 1058, సిద్దవటంలో 100, రైల్వేకోడూరులో 185, పులివెందులలో 320, నందలూరులో 211, లక్కిరెడ్డిపల్లెలో 83, కమలాపురంలో 158 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. మొత్తం కేసుల పరిష్కారానికి కక్షిదారులకు రూ. 30,62,35,148లు చెల్లింపులు జరిగాయన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి తోడ్పడిన న్యాయవాదులకు, రెవెన్యూ సిబ్బందికి, పోలీస్ అధికారులకు, ఇన్సూరెన్స్, బ్యాంకు అధికారులు తదితరులకు కృజ్ఞతలు తెలియజేశారు.

జనసంద్రమైన జ్యోతి క్షేత్రం

- ముగిసిన కాశినాయన ఆరాధనోత్సవాలు
- జ్యోతి దర్శనంతో పులకించిన భక్తులు
- కన్నుల పండువగా సాగిన రథోత్సవం

కాశినాయన డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నల్లమల అటవీ ప్రాంతంలోని జ్యోతి క్షేత్రం జనసంద్రమైంది. శనివారం అర్ధరాత్రి నిండైన జ్యోతి దర్శనంతో కాశినాయన భక్తులు ఆనందపరవశులయ్యారు. అనంతరం రథో త్సవం వైభవంగా సాగింది. వివరాలిలా.. జ్యోతి క్షేత్రంలో శనివారం కాశినాయన ఆరాధనోత్సవాలు ప్రారంభం కాగా.. ఆదివారం ప్రత్యేక పూజలు, హోమాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో జ్యోతి క్షేత్రం హోరెత్తింది. దట్టమైన అటవీప్రాతంలో వణికిస్తున్న చలిని సైతం లెక్క చేయకుండా భక్తులు శనివారం అర్ధరాత్రి జ్యోతి దర్శనం చేసుకున్నారు. ఆ తర్వాత కన్నుల పండువగా సాగిన కాశినాయన రథోత్సవంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. రెండు రోజుల ఆరాధనలో దాదాపు లక్షమంది భక్త లు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. గతంలో నిర్వహించిన ఆరా ధనల కంటే ఈఆరాధనకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చినట్లు చెబు తున్నారు. రెండు రోజులూ నిరంతరాయంగా భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆరాధనకు వచ్చిన భక్తులే అన్నింటతామై కార్యక్రమా న్ని జయప్రదం చేశారు. ఆరాధనలో పాల్గొన్న భక్తులు భారీగా బియ్యం, సరుకులు అందజేశారు. ఆలయ నిర్వాహకులు, పోలీసులు, ఆర్టీసీ అధికారులు, హెల్త్ డిపార్ట్‌మెంట్ సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేయడంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆరాధనోత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి.

లింగాలలో...: స్థానిక వనంబావి శివాలయంలో ఆదివారం కాశినాయన ఆరాధన మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో టీడీపీ పులివెందుల ఇన్‌చార్జి బీటెక్ రవి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రూ.50వేలు నగదు వితరణగా అందించారు. ఈ సందర్భంగా మహిళలు నిర్వహించిన కోలాటం, భజన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం బండలాగుడు పోటీలను సారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ప్రారంభించి... ప్రథమ స్థానంలో నిలిచిన ఎడ్ల యజ మానికి రూ.70వేల నగదు బహుమతి అందించారు. రెండు, మూడు, నాలుగు స్థానాల్లో నిలిచిన వారికి రూ.50వేలు,రూ.40వేలు, రూ.30వేలు నగదు బహుమతులను అందజేశారు.


కాశినాయన రథోత్సవంలో పాల్గొన్న భక్తులు


భక్తులకు దర్శనమిచ్చిన కాశినాయన జ్యోతి వెలుగు

ఖాజీపేటలో...: కడప- కర్నూలు జాతీయ రహదారిలోని పత్తూరు వద్ద గల శ్రీకాశిరెడ్డినాయన 28వ ఆరాధనోత్సవాలు ముగిశాయి. ఉదయం స్వామివారికి మహానైవేద్యం సమర్పించారు. పది గంటల నుంచి తాళం భజన ప్రారంభించారు. ఈ భజనలో 20 గ్రామాల భజన బృందాలు పాల్గొన్నాయి. గెలుపొందినవారికి బహుమతులు అందజేశారు.

16 నుంచి తైక్వాండో శిక్షణ తరగతులు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయ వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థినులకు ఈనెల 16 నుంచి 21వ తేదీ వరకు క్యాంపస్‌లో తైక్వాండో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు పీజీ కళాశాల ప్రధానాచార్యులు, హాస్టళ్ల చీఫ్ వార్డన్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి తెలిపారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం గంటన్నర పాటు నిపుణులు శిక్షణ ఇస్తారని వివరించారు. హాస్టల్స్ విద్యార్థినులు హాజరయ్యేలా చూడాలని అన్ని విభాగాల అధిపతులు, కోఆర్డినేటర్‌లకు సూచించారు.

ఉమెన్ ప్రీమియం క్రికెట్ లీగ్‌కు శ్రీ చరణి ఎంపిక



కడప స్పోర్ట్స్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉమెన్ ప్రీమియం క్రికెట్ లీగ్‌కు కడపకు చెందిన క్రీడాకారిణి ఎన్.శ్రీచరణి (రూ.55 లక్షలకు) ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు ఎంపికయ్యారు. దీంతో జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎం. భరత్‌రెడ్డి, అవ్వారు రెడ్డి ప్రసాద్ హర్షం వ్యక్తం చేస్తూ ప్రత్యేక అభినందనలు తెలిపారు. ప్రీమియర్ విభాగ పోటీలలో రాణించి తద్వారా జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

గురుకుల పాఠశాల మరమ్మతులకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్

- ఎమ్మెల్యే చొరవతో రూ.62 లక్షలు మంజూరు




కొండాపురం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): చౌటిపల్లె వద్ద ఉన్న బాలికల గురుకుల పాఠశాల మరమ్మ త్తులకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. పాఠశాలలో ఇటీవల ఇద్దరు విద్యార్థులు పాముకాటుకు గురైన సంగతి తెలిసిందే. గురుకుల పాఠశాలలో సుమా రు 600 మంది విద్యార్థులు ఇంటర్ వరకు చదువు తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పాఠశాలలో మెయింటెనెన్స్ పనులు గాలికివది లేసింది. దీంతో పాఠశాలలో బాత్‌రూమ్‌లు, తలుపులు, కిటికీలు అధ్వానంగా తయారై. పాములు, కోతులు పాఠశాలలోకి వస్తుండడంతో విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈ పరిస్థితిపై ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో తక్షణం మెయింటెనెన్స్ పనులు చేపట్టడానికి రూ.62లక్షలు మంజూరయ్యాయి. త్వరలో పనులను చేపట్టనున్నట్లు మాజీ సర్పంచ్, కాంట్రాక్టర్ రామలింగేశ్వరరెడ్డి తెలిపారు.



యూసీఐఎల్ ఉద్యోగి కాలువలో పడి గల్లంతు?

- గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు

పులివెందుల టౌన్, డిసెంబర్ 15 (ఆంధ్ర జ్యోతి): యురేనియం కర్మాగారంలో పనిచేస్తున్న పాలగిరి రామాంజనేయులు (28) అనే ఉద్యోగి కాలువలో పడి గల్లంతయ్యాడు. ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లిన రామాంజనేయులు పులివెందుల పట్టణ పరిధిలోని నల్లపురెడ్డిపల్లి రహదారి సమీపంలో ఉన్న కాలువ గట్టున మోటార్ బైక్ దగ్గర చెప్పులు వదిలి కనిపించలేదు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. కాలువలో పడి గల్లంతు అయి ఉండవచ్చని పోలీసులు, ఫైర్ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. రామాంజనేయులు యురేనియం కర్మాగారంలో ఏఎండీ ఆపరేటర్ (ఔట్ సోర్సింగ్ ఉద్యోగి)గా పని చేస్తున్నాడు. సొంత గ్రామం వేముల మండలం మబ్బు చింతలపల్లి. ప్రస్తుతం పట్టణంలోని ఎరుగుడిపల్లెలో నివాసం ఉంటున్నారు. కాలువలో పడి గల్లంతు అయ్యాడా.. ఎవరైనా ఏమైనా చేశారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



అపూర్వం పూర్వ విద్యార్థుల సమ్మేళనం


అపూర్వ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

నందలూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం హైస్కూలు, కళాశాల పూర్వ విద్యార్థుల (1983 బ్యాచ్) సమ్మేళనం ఆదివారం అపూర్వంగా జరిగింది. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాలలో ఉన్న వారంతా కలిసి నాటి మధురస్మృతులను నెమరువేసుకున్నారు. ఆనందోత్సాహాలతో గడిపారు. అనంతరం అప్పటి గురువులు జీవీ కృష్ణయ్య, గానుగపెంట హనుమంతరావు, ఆకుల వెంకటసుబ్బయ్య, రామసుబ్బన్న, లక్ష్మీకాంతమ్మలను ఘనంగా సత్కరించారు. అనారోగ్యంతో బాధపడుతున్న తమ తోటి విద్యార్థి సీహెచ్ నాగేశ్వరరావుకు రూ.25వేలు, చనిపోయిన మరో విద్యార్థి సుబ్రమణ్యం కుటుంబానికి రూ.25వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సమ్మేళనంలో మాజీ ఏజీపీ షేక్ మహ్మద్‌అలీ, షైనుద్దీన్, కోడూరు సుమన, సువర్ణకుమార్ తదితర పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులలో ఉత్తీర్ణత సులభతరం

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 15 (ఆంధజ్యోతి): శిక్షణ తరగతుల ద్వారా ఉత్తీర్ణత సులభతరం అవుతుందని ఏపీ జేఏసీ జిల్లా చైర్మన్ శ్రీనివాసులు, ఏపీ ఎన్జీఓ జిల్లా కార్యదర్శి రవి కుమార్ తెలిపారు. ఆదివారం కడప ఎన్జీఓ భవన్‌లో ఏపీటీఎఫ్ అమరావతి ఆధ్వర్యంలో డిపార్ట్‌మెంటల్ పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన వారు మాట్లాడుతూ ఉద్యోగులు ఉపాధ్యాయులు డిపార్ట్‌మెంటల్ పరీక్షలు సులభంగా ఉత్తీర్ణత కావాలంటే శిక్షణా తరగతులలో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. డిపార్ట్‌మెంటల్ పరీక్షలు ప్రశ్నాపత్రంపై అవగాహన పెంచుకోవాలని చెప్పారు. భవిష్యత్తులో ఉద్యోగులకు వృత్తినైపుణ్య సదస్సులు కూడా ఏర్పాటు చేయాలని కోరారు.

ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమం దృష్ట్యా చైతన్య సదస్సులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. డిపార్ట్‌మెంటల్ పరీక్షలకు కావాల్సిన అభ్యసనా ప్రక్రియ గురిం చి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ అమరావతి నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, సత్యం, వీరప్రసాద్‌తో పాటు ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ టెన్నిస్ రాష్ట్ర జట్టు కోచ్‌గా పోలంకి గణేశ్‌బాబు



నందలూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌బాల్ టెన్నిస్ ఆంధ్రప్రదేశ్ జట్టు కోచ్, మేనేజర్‌గా టంగుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ పోలంకి గణేష్ బాబు నియమితులైనట్లు ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని భోపాల్ (దేవాస్)లో ఈనెల 18 నుంచి 26వ తేదీ వరకు జాతీయస్థాయి అండర్-14, అండర్-17, అండర్-19 విభాగాల్లో ఈ పోటీలు జరగనున్నాయి. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఆయనను అభినందించారు.

గండికోట నుంచి 100 క్యూసెక్కులు విడుదల


మెయిన్‌కెనాల్ నుంచి విడుదలవుతున్న నీరు

కొండాపురం, డిశంబరు 15 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు నుంచి జీఎన్ ఎస్ఎస్ మెయిన్‌కెనాల్ ద్వారా 100 క్యూసెక్కులు వదులు తున్నట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. కమలాపురం రైతుల అవసరాల దృష్ట్యా ఈ నీటిని వదులుతున్నామన్నారు. కాగా ప్రస్తుతం ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో లేదన్నారు. ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 26.07 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ తెలిపారు.

శ్రీకృష్ణ దేవరాయకాలనీలో చోరీ

- 15తులాల బంగారం, రూ 4.50లక్షల నగదు, రెండు కిలోల వెండి అపహరణ


పరిశీలిస్తున్న ఎస్ఐ రాజరాజేశ్వర్ రెడ్డి

కడప(క్రైం), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని శ్రీకృష్ణ దేవరాయకాలనీలోని ఓ వ్యక్తి ఇంట్లో దొంగలు పడి బంగారం, నగదు, వెండి వస్తువులను అపహరించారు. బాధితుడు రాజశేఖర్ హౌసింగ్ బోర్డు కాలనీలో ప్లే స్కూల్ నిర్వహిస్తున్నాడు. శని, ఆదివారం రెండు రోజులు సెలవులు కావడంతో సొంత ఊరు చక్రాయపేటకు కుటుంబంతో కలిసి వెళ్లారు. దొంగలు అతని ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న 15 తులాల బంగారు నగలు, రెండు కిలోల వెండి సామగ్రి, రూ.4.50 లక్షల నగదును అపహరించారు. సమాచారం తెలిసిన చిన్నచౌకు సీఐ ఓబులేసు, ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. చోరీ ఘటనను పరిశీలించి.. క్లూస్ టీంను పిలిపించి దొంగల వేలిముద్రలను సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జీవామృతం పంటకు జీవనాధారం



జీవామృతం తయారు చేస్తున్న సిబ్బంది

రైల్వేకోడూరు(రూరల్), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ద్రవ జీవామృతం పంట కు జీవనాధారం అని వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జ్ ఎం.సుబ్బరాయుడు తెలిపారు. ఆదివారం ఉర్లగడ్డపోడు గ్రామంలో ఐసీ ఆర్‌పీ వెంకటరత్నం పొలంలో ద్రవ జీవా మృతం తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ ద్రవ జీవామృతం వినియోగంతో సూక్ష్మజీవులు అభివృద్ధి చెంది భూసారాన్ని పెంచుతాయన్నారు. పెట్టుబడి తగ్గుతుంద ని తెలిపారు. ఈ కార్యక్రమంలో చియ్యవరం యూనిట్ ఐసీ ఆర్‌పీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

చెత్త తొలగింపు



చెత్త తొలగింపు పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్ , పంచాయతీ కార్యదర్శి

సిద్దవటం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాధవరం గ్రామంలో చెత్త పేరుకుపోయిన అంశంపై ఆంధ్ర జ్యోతిలో ప్రచురితమైన కథనానికి గ్రామ సర్పంచ్ జానకిరామయ్య స్పందించి పారి శుధ్య పనులు చేయించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్త తర లించే ట్రాక్టర్ చెడిపోవడంతో చెత్త తొల గింపు కాస్త ఆలస్యమైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ లక్ష్మీ నరసయ్య, హరిత రాయబారులు పాల్గొన్నారు.

ఘనంగా మహంకాళి ఆలయ పదో వార్షికోత్సవం



ప్రత్యేక అలంకారంలో మహంకాళి

రాజంపేట టౌన్, డిసెంబరు 15 (ఆంధ్ర జ్యోతి) : మండలంలోని వెంకట రాజంపేట లో ఆదివారం మహంకాళి ఆల య 10వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సంద ర్భంగా తెల్లవారుజాము నుంచి అభి షేకాలు, పూజలు నిర్వహించారు. అనం తరం అమ్మవారిని అలంకరించారు. కుంకు మార్చన, చండీ హోమం నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించు కుని మొక్కులను తీర్చుకున్నారు. నిర్వాహ కులు అన్నదాన చేశారు.

క్యాలెండర్ విడుదల

సిద్దవటం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాధవరం-1 గ్రామంలో ఆదివారం బ్రహ్మకుమారీల క్యాలెండర్‌ను జనసేనపార్టీ నేత అతికారి కృష్ణ విడుదల చేశారు. కూటమి నేతలు, జనసేన పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నాగారపమ్మకు పూజలు

సుండుపల్లె, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దినేనికాలువ గ్రామ పంచాయతీ ఈడిగపల్లె సమీపంలో వెల సిన నాగారపమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారిని ప్రత్యేకంగా అలం కరించి పట్టువస్త్రాలను సమర్పించారు. మొక్కుబడులు ఉన్న భక్తులు అమ్మవారికి తలనీలాలు, బోనాలు సమర్పించారు.

మడుగును తలపిస్తున్న రోడ్లు



రోడ్డుపై నిలిచిన మురుగు నీరు

● రోగాల బారిన ప్రజలు

ఒంటిమిట్ట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వీధుల్లో రోజుల తరబడి మురుగునీరు నిలిచిపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని మండల పరిధిలోని దర్జీపల్లె వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని సచివాలయం ఎదురుగా ఉన్న వీధిలో రోడ్డులో నిలిచిన నీరు మడుగును తలపిస్తున్నాయని అంటున్నారు. ఇందులోనే పశువుల పాకల నుంచి వచ్చే వృథా నీరు కలుస్తుం డడంతో ముక్కుపుటాలదిరేలా దుర్గంధం వెలువడుతోందని, ఇంటిలోంచి బయట కు వెళ్లాలంటే ఆ నీటిలోనే నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తోందని అంటున్నారు. ఈ మురుగునీటి నిల్వల కారణంగా దోమలు, ఈగలు పెరిగిపోతున్నాయని ఆందోళన చెందుతున్నారు. ఇక గ్రామంలోని అన్ని ప్రాంతాల్లో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. ప్రస్తుత ప్రభుత్వమైనా గ్రామంలో రోడ్లు వేసి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

తరచూ అనారోగ్యంపాలు

మురుగు నీటి నిల్వల కారణంగా దోమలు, ఈగలు పెరిగిపోయి అనారోగ్య సమస్యలు ఏర్పడుతు న్నాయి. స్థానిక ప్రజా ప్రతినిధు లు గాని, అధికా రులుగాని రోడ్డు ఏర్పాటుకు సహకరించలేదు. తక్షణమే నీరు తొలగించాలి.

- బత్తల సుబ్బరాయుడు, దర్జీపల్లె.

రాత్రి వేళల్లో ఇబ్బందులు

రాత్రి వేళల్లో రోడ్డు కనపడక మురుగునీటిలో జారి పడడంతో కాలు విరిగింది. దాంతో ఆసుపత్రి పాలయ్యాం. కొన్నేళ్లుగా మురుగు నీటితో సతమత మవుతున్నాం. రోడ్డు వేసి నీరు నిల్వలేకుండా చూడాలి.

- పుల్లమ్మ, దర్జీపలె

ఆక్రమణలే కారణం

రోడ్డుకు ఇరువైపులా మట్టి కుప్పలు వేయడంతో నీరు రోడ్డుపై నిలుస్తోంది. సమస్య పరిష్కారం కోసం గ్రామస్థులతో చర్చించాం. ఇప్పటికే ఉన్నతా. దికారుల దృష్టికి తీసుకెళ్లాం. నీరు నిల్వ ఉండ కుండా చర్యలు తీసుకుంటాం.

- భావన, సెక్రటరీ, గొల్లపల్లె

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

● మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి



స్థానిక ప్రజలతో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కారమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చం ద్రబాబునాయుడు, మంత్రులు పనిచేస్తున్నామని మంత్రి మండిపల్లె రాం ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆదివారం లక్కి రెడ్డిపల్లెలో ఆయన సుడిగాలి పర్యటన చేశారు. పలువురిని పరామర్శించారు. అనంతరంగా విలేకర్లతో మాట్లా డుతూ రెవెన్యూ సదస్సులతో ప్రజల సమస్యలు పరిష్క రిస్తున్నామన్నారు. ఇప్పటికే గ్రామాల్లో రోడ్లు, తాగునీటి సమస్యలు పరిష్కరించామన్నారు. లక్కిరెడ్డిపల్లెలోని ఏపీ మోడల్ స్కూల్‌కు ఆర్టీసీ బస్సును సకాలంలో నడపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వేంపల్లె -రాయచోటి జాతీయ రహదారి ప్రమాదకరంగా ఉందని ప్రజలు మంత్రి దృష్టికి తీసుకెళ్లగా త్వరలో టెండర్ పిలిచి పనులు పూర్తి చేస్తామన్నారు. లక్కిరెడ్డిపల్లెలోని బస్టాండ్‌కు బస్సులు వచ్చేట్లు చేయాలని ప్రజలు కోరారు. వేంపల్లె,రాయచోటి రోడ్డు పూర్తయిన వెంటనే బస్టాండ్‌కు బస్సులు మళ్లిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యువ నాయకుడు యన మల మదన్ మోహన్ , కొండూరు వెంకటరామరాజు, రాజంపేట పార్లమెంటు డాక్టర్ల సెల్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ షఫీనాయక్, శ్రీకాంత్ ఆరీఫ్, జేకేరెడ్డి, సుదర్శన్ బాబు, మల్లికార్జున, రమణ, సుధీర్‌కుమార్, రామచంద్ర య్య, ముక్తార్‌అహ్మద్ తదితరులు పాల్గొన్నారు

రామాపురం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన చెనిక్కాయలపల్లెకు చెందిన బడి మెల రవీంద్రను ఆదివారం రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండి ఎల్లి రాంప్రసాద్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రవీంద్ర త్వరగా కోలుకోవాలని కోరుకున్నారు.

అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఘననివాళి



పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అమర్‌నాథ్‌రెడ్డి, ఆర్యవైశ్యులు

రాజంపేట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణం లోని జౌళీ బజారులో ఉన్న అమరజీవి పొటి శ్రీరాములు విగ్రహానికి ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్ రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆదివారం పొట్టిశ్రీరాములు వర్థంతి సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణత్యాగం చేసిన మహనీయుడు పొట్టిశ్రీరాములు అన్నారు. ఆర్య వైశ్యనేతలు సనిశెట్టి నవీన్‌కుమార్, యేల్చూరి అశోక్, బి.రాజేష్, నరేంద్ర, బింగి హరి, కళ్యాణ్, నాగేంద్ర, గునిపూటి నాని, దోర్నాదుల సురేష్, ఇంద్ర, మధు, తదితరులు పాల్గొన్నారు.

సిద్ధవటం: మండలంలోని ఏపీఎస్పీ 11వ పోలీసు బెటాలియన్‌లో ఇన్‌చార్జి కమాండెంట్ ఈ. నాగేశ్వరప్ప పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. బెటాలియన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంబేపల్లె: సంబేపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమరజీవి చిత్రపటానికి ఉపాధ్యా యులు, విద్యార్థులు పూలమాలలు వేసి ఆయన గొప్పదనాన్ని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మడితాటి నరసింహారెడ్డి మా ట్లాడుతూ తెలుగువాడి గొప్పతనాన్ని చాటి చెప్పిన వ్యక్తి పొట్టి శ్రీరాములు అన్నారు. తెలుగువాళ్లందరినీ ఒక్క తాటిపైకి తెచ్చిన ఆయన ప్రతి తెలుగువారి గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించారన్నారు. ఈ కార్యక్రమంలో సైన్స్ ఆఫీసర్ మార్ల ఓబుల్‌రెడ్డి, పాఠ శాల ఉపాధ్యాయులు రవిశంకర్, పూజారి నాగయ్య, శంకరయ్య, పఠాన్ మహబూబ్‌బాషా, విద్యార్థులు పాల్గొన్నారు.

వీరబల్లి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోధ్యాయుడు రెడ్డెయ్య, బహుజన టీచర్స్ అసో సియేషన్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పల్లం రామచంద్ర ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. ఆర్యవైశ్య సం ఘం నాయకులు పవన్‌కుమార్, వెంకట్రమణ, సుబ్ర మణ్యం, సురేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రెడ్డెయ్య ,తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాసులు,ఏపి మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ కోమటిరెడ్డి శివశంకర్‌రెడ్డి నివాళు లర్పించారు వైఎస్ ప్రిన్సిపాల్ రాజక్‌కుమార్, హెచ్ ఎం రమణమ్మ ,రామాంజనేయులు పాల్గొన్నారు.



సంబేపల్లె: నివాళులర్పిస్తున్న ప్రధానోపాధ్యాయుడు మడితాటి నరసింహారెడ్డి, తదితరులు

'అన్నమాచార్య'లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

రాజంపేట టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. కోఆర్డినేటర్ డాక్టర్ కాశిగారి ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఆత్మీయ సమావేశానికి 2002-2004 ఎంబీఏ బ్యాచ్‌కు చెందిన 257 మంది హాజరై తమ అనుభవాలను పంచుకున్నారు. అన్నమాచర్య విద్యా సంస్థల వైస్ ఛైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ప్రిన్సిపాల్ ఎస్ఎంవీ నారాయణ, కె.ప్రదీప్ తదితరులు ప్రసంగిస్తూ అన్నమాచార్యలో 20 ఏళ్ల కిందట ఎంబీఏ పూర్తి చేసి ఈ రోజు ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించుకోవడం స్ఫూర్తిదాయకమన్నారు.

బోధనేతర సిబ్బంది సంక్షేమానికి కృషి

నందలూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న బోధనేతర సిబ్బంది సంక్షే మానికి కృషి చేస్తామని గురుకుల పాఠశాలల బోధ నేతర సిబ్బంది సంఘం గౌరవ అధ్యక్షుడు శివకాంత్, అధ్యక్షుడు మనోహర్‌నాయుడు తెలి పారు. విజయవాడలోని రాష్ట్ర ఎన్జీవో హోంలో ఆదివారం మహాత్మా జ్యోతిబాపూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల బోధనేతర సిబ్బంది సంఘం 6వ వార్షికోత్సవాలు నిర్వహించారు. ఆప్కోస్ సిబ్బందికి మినిమం టైం స్కేల్, కాంట్రాక్టు, భోదనేతర సిబ్బందిని రెగ్యులరైజేషన్ చేయాలని సంఘం ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ప్రశాంత్ కోరారు. ఈ కార్యక్రమంలో కడప జిల్లా ట్రెజరర్ అశోక్, రాష్ట్ర నలుమూలల నుంచి రెగ్యులర్, కాంట్రాక్టు ఆప్కోస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అదనపు ఆదాయం

ఓబులవారిపల్లె, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంలో ఒకే పొలంలో ఒకేసారి వివిధ పంటలు పండించి అదనపు ఆదాయం పొందవచ్చని సీఎస్‌పి శంకరయ్య తెలిపారు. ఆదివారం అనంతపురం జిల్లాలోని శ్రీకృష్ణదేవరాయ హార్టీకల్చర్ కాలేజీ విద్యార్థులతో కలసి ఆయన మండలంలోని బాలిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీలో అరటిలో అంతరపంటలుగా బంతి, వంగ, టమోటా, వెల్లుల్లి, మిరప, బార్డర్ క్రాపుగా కంది, ఆముదం సాగు చేస్తుండడాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జీవామృతం తయారీని వివరించారు. అంతర పంటలతో జీరో బడ్జెట్ వ్యవసాయం చేయవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయంలో అనుసరించాల్సిన పద్ధతు లను ఐసీఆర్‌పీ రత్నమ్మ, ఎంసీఏ బుల్లయ్య తెలిపారు.

ప్రమాదాల నివారణకు పోలీసుల చర్యలు

సిద్దవటం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలు నివారించడంలో భాగంగా సిద్దవటం పోలీసులు ఆదివారం హైలెవల్ వంతెనపై రోడ్డుకు ఇరువైపులా ఉన్న మట్టి కుప్పలను, పోలీసు లైన్ క్రాస్ వద్ద, ఆర్ అండ్ బి రోడ్డుకు ఇరువైపుల ఉన్న ముళ్ల చెట్లను తొలగించారు. ఈ సందర్భంగా హెడ్ కానిస్టేబుల్ రమణ ఆదివారం మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు మలుపుల వద్ద నెమ్మదిగా వెళ్లాలన్నారు. ప్రతిఒక్కరు హెల్మెంట్ ధరించాలని సూచించారు. స్థానిక పోలీసులు శివ, రామకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కూలేందుకు సిద్ధంగా విద్యుత్ స్తంభాలు



వాలిపోయిన విద్యుత్ స్తంభాలు

రామాపురం, డిసెంబరు15 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని చిట్లూరు పం చాయతీ మాలపల్లికి పక్కనే ఉన్న చెరువు అలుగు దగ్గర ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు కూలి పోవడానికి సిద్ధంగా ఉన్నా యని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తు న్నారు. ప్రతి రోజూ తాము ఈ మార్గం లోనే పొలాలకు వెళుతుంటామని, పెద్ద గాలి వాన వస్తే ఈ స్తంభాలు కూలిపోయే అవకాశం ఉందని తెలిపారు. ఎలాంటి ప్రమాదం సంభ వించక మునుపే అధికారులు స్పందించి వీటి స్థానంలో కొత్త కరెంటు స్తంభాలు ఏర్పాటు చేయాలని రైతులు, గ్రామస్తులు కోరుకుంటున్నారు.

పౌర్ణమి సందర్భంగా మహాగణపతి హోమం

రాయచోటిటౌన్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక పాతరాయచోటిలోని అగస్త్యేశ్వరస్వామి దేవాలయంలో పౌర్ణమి సందర్భంగా ఆదివారం మహాగణపతి హోమం చేశారు. అనంతరం పార్వతీ, పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు చేసి పుష్పాలు, పట్టువస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలకరించి పల్లకిపై ఊరేగించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

'యుద్ధాలు వద్దు.. మానవాళి పరిరక్షణ ముద్దు'

రాయచోటిటౌన్, డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): యుద్ధాలు వద్దు.. మానవాళి పరిరక్షణ ముద్దు అని హ్యూమానిటేరియన్స్ ఆర్గనైజేషన్ ఫౌండర్ సతీశ్‌కుమార్ అన్నారు. ఆదివారం పట్టణంలోని సాయిశుభ కల్యాణ మండపంలో 'సేవ్ ఎర్త్.. నో వార్' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యుడు బయ్యారెడ్డి మాట్లా డుతూ ప్రపంచ దేశాలన్నీ యుద్ధాలను ప్రోత్సహిస్తున్నాయన్నారు. వీఆర్ విద్యాసంస్థల అధినేత వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ యుద్ధాలు నివారించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర బాధ్యుడు కొండూరు శ్రీనివాసరాజు మా ట్లాడుతూ ప్రతి విద్యార్థి వాతావరణ పరిరక్షణ, యుద్ధాల నివారణ అనే అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. లయన్ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 23న జరగబోవు ర్యాలీని విజయవంతం చేయాలన్నారు. .

దండుమారెమ్మ సన్నిధిలో డీఆర్‌వో



పూజలు చేస్తున్న డీఆర్‌వో మధుసూదన్‌రావు వాల్మీకి సంఘం అధ్యక్షుడు బుజ్జిబాబు

రాయచోటిటౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బోయవీధిలో ఉన్న దండు మారమ్మ ఆలయాన్ని అన్నమయ్య జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావు ఆదివారం దర్శించుకున్నారు. వాల్మీకి సంఘం జిల్లా అధ్యక్షుడు యోగానంద బాబు ఆధ్వ ర్యంలో వాల్మీకి సంఘం సభ్యులు ఆయనకు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన పూజలు నిర్వహించి కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో గువ్వల జగదీశ్, నాగార్జున, ప్రసాద్, సాకే రెడ్డిఆంజనేయులు, మీనగ నాగసుబ్బయ్య, జగన్, రెడ్డెయ్య పాల్గొన్నారు.

క్రీడలతో కీర్తి ప్రతిష్టలు : సుగవాసి



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న సుగవాసి బాలసుబ్రమణ్యం

రాజంపేట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తేనే కీర్తిప్రతిష్టలు లభి స్తాయని రాజంపేట నియోజ కవర్గ టీడీపీ ఇన్‌చార్జి సుగ వాసి బాలసుబ్రమణ్యం తెలి పారు. రాజంపేట మండలం వెంకటరాజంపేట క్రీడా ప్రాంగ ణంలో గీతాంజలి విద్యాసంస్థల అధినేత ఎస్వీ రమణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గీతాంజలి ప్రీమియర్ లీగ్ సీజన్-3 టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. టోర్నమెంట్ నిర్వాహకుడు మాట్లాడుతూ సంక్రాంతి సంబరాల్లో భాగంగా యువకుల్లోని క్రీడా నైపుణ్యా న్ని వెలికి తీయడానికి జిల్లాస్థాయిలో ఈ పోటీలు నిర్వహిస్తున్నా మన్నారు. అనంతరం జ్యోతిని వెలిగించి క్రీడా పోటీలను ప్రారంభించారు. మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు పొందూరు కొండయ్యనాయుడు, నాగేశ్వర నాయుడు, జిల్లా టీడీపీ లీగల్‌సెల్ అధ్యక్షుడు టి.లక్ష్మీనారాయణ, గీతాంజలి విద్యా సంస్థల డైరెక్టర్ వినయ్, రాజంపేట మండల మాజీ ఉపాధ్యక్షుడు నాగా సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సుగవాసికి సత్కారం: సాగునీటి సంఘాల ఎన్నికల్లో విజయం సాధించిన పలువురు నేతలు ఆదివారం నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో సుగవాసిని సత్కరించారు. పోలి, ఊటుకూరు తదితర ఆయకట్టు సంఘాల నూతన కమిటీల అధ్యక్ష, ఉపాధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

నీటి సంఘం ఛైర్మన్‌కు సన్మానం



దేవదాసి చెరువు ఛైర్మన్ మహేశ్వర్‌రాజును సన్మానిస్తున్న జగన్‌మోహన్‌రాజు

వీరబల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి):నీటి సంఘాల ఎన్నికల విజేతలను ఆదివారం రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్ రాజు సత్క రించారు. అనంతరం నీటి సంఘం సభ్యులను అభినం దించారు. మండల టీడీపీ అధ్యక్షులు భానుగోపాల్‌రాజు, వీరబల్లి మండల సొసైటీ ప్రెసిడెంట్ కల్లూరి రాంమోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సద్వినియోగంతోనే పదవులకు సార్థకత



ఆయకట్టు పాలకమండలి సభ్యులను అభినందిస్తున్న సాయిలోకేష్

రాజంపేట, గాలి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) :సాగునీటిని సద్వినియోగం చేసుకుంటేనే సాగునీటి సంఘాల పదవుల కు సార్థకత లభిస్తుందని రాజంపేట పార్లమెంట్ బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేష్ తెలి పారు. ఆదివారం బీజేపీ పార్లమెంట్ కార్యాలయంలో ఒంటిమిట్ట చెరువు సంఘం ఛైర్మన్ పాటూరు గంగిరెడ్డి తదితరులు సాయిలోకేష్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన ఆయకట్టు సంఘ సభ్యులు, ఆయా ప్రాంతాల్లోని చెరువులు, గుంటలను., కాలువలను ఆధునీకరించి వర్షాకాలంలో నీటిని నిల్వ చేసుకుని పంటలు పండించుకుంటే పదవులకు సార్థకత ఉంటుందన్నారు. చెరువుల్లో పూడికలు తీయక, కాలువల్లో కనీసం కంపచెట్లను కూడా తొలగించకపోవడంతో వర్షపు నీరు వృథా అవుతోందన్నారు. ఈ సందర్భంగా ఒంటిమిట్ట చెరువు సంఘం అధ్యక్షుడు గంగిరెడ్డిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి కృష్ణయాదవ్, కిసాన్‌మోర్చా జోనల్ మాజీ ఇన్‌చార్జి వెంకటరామరాజు, ఒంటిమిట్ట బీజేపీ అధ్యక్షుడు బాలరాజు పాల్గొన్నారు.

గంగనపల్లి వెంకటరమణకు ఘనసత్కారం



వెంకటరమణను సత్కరిస్తున్న రాయలసీమ సాంస్కృతిక సంఘ సభ్యులు

రాజంపేట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అనంతపురం లో ఆదివారం నిర్వహించిన రాయలసీమ మహాకవి సమ్మే ళనంలో రాజంపేటకు చెంది న తెలుగు పండితుడు, తె లుగుభాష సంరక్షణ సమితి జిల్లా సహాయ కార్యదర్శి గంగ నపల్లి వెంకటరమణను ఘనంగా సత్కరించారు. రాయలసీమ సాం స్కృతిక వేదిక, వేమన అధ్యయన, అభివృద్ధి కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాయలసీమ సాహితీరత్నం కట్టా నరసింహులు అనే అంశంపై పంచ పద్య రత్నాలను గంగనపల్లి వినిపించారు. ఈ సంద ర్భం గా కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ అప్పిరెడ్డి హరినాథ్‌రెడ్డి, బొజ్జా దశరథ రామిరెడ్డి, ప్రముఖ రచయిత నారాయణస్వామి వెంకటరమణను సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

కడపకు తరలిన రాజంపేట ముస్లింలు

రాజంపేట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగ పరిరక్షణ పేరుతో కడపలో ఆదివారం నిర్వహిస్తున్న కార్యక్రమానికి రాజంపేట నుంచి ముస్లింలు ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. రాజంపేట పాతబస్టాండు రహమతీయ మసీదు అధ్యక్షుడు సయ్యద్‌గౌస్‌బాషా ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయగా, మైనార్టీ నేతలు జెండా ఊపి ఈ కార్యక్రమాన్ని ప్రారం భించారు. ముజఫర్‌అహ్మద్, నాయతుల్లా, కరీం, మోహన్‌ఖాన్, మహ్మద్‌గౌస్ తదితరులు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె : మండలంలోని మదీనా మర్కాస్ మసీదు పరిధిలోని పలు పంచాయతీల నుంచి ముస్లింలు కడపకు తరలి వెళ్లారు.

'కూటమి ప్రభుత్వం కార్మికులకు చేసింది శూన్యం'

రైల్వేకోడూరు(రూరల్), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ ఆరు నెలల పాలనలో ప్రచార ఆర్భాటం తప్ప కార్మికులకు చేసింది శూన్యం అని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి సాంబశివ ఆరోపించారు. ఆదివారం పట్టణంలోని ఏఐటీయూసీ కార్యా లయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ కార్మికుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అంగన్వాడీలు, ఆశా, భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పరిశ్రమలను ఏర్పాటు చేసి కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. రాష్ట్రంలో కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గంగాధర్, పోకూరి మురళి, జ్యోతి చిన్నయ్య, సరోజమ్మ, రత్నమ్మ, త్రివేణి కార్మిక సంఘం నాయకులు వెంకటరమణ, సుబ్రహ్మణ్యం, రమేష్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇంటి స్థలాలపై సీపీఐ హర్షం

రైల్వేకోడూరు(రూరల్), డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పేదలకు పట్టణంలో రెండు సెంట్లు, పల్లెల్లో మూడు సెంట్లు ఇంటి స్థలాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు చేసిన ప్రకటనపై సీపీఐ హర్షం వ్యక్తం చేస్తోందని రైల్వేకోడూరు నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏర్పాటు చేసిన కలెక్టర్ల సమావేశంలో 2029 నాటికి అర్హులందరికీ ఇళ్లు నిర్మిస్తాం అని హామీ ఇచ్చారన్నారు. సీపీఐ పోరాటాలతోనే ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించిందన్నారు.

నిలిపి ఉంచిన కారు దగ్ధం

పుల్లంపేట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బావనాఋషి గుడి ఎదురుగా పార్కింగ్ చేసిన ఓ కారు ఆదివారం దగ్ధమైంది. పుల్లంపేటకు చెందిన నూకల జగదీష్ గుడిముందు కారును ఆపుతుంటాడు. ఆదివారం ఉన్నట్టుండి ఆ కారు నుంచి మంటలు రావడం స్థానికులు గమనించి యజమానికి తెలియజేశారు. మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నిం చినా ఫలితం లేకపోవడంతో రాజపేంట నుంచి అగ్నిమాపక వాహనం వచ్చి మంటలను ఆర్పివేసింది. కారు యజమాని పుల్లంపేట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

జన్ ఔషధీలో... చౌక ధరలకే మందులు

- డీసీఎంఎస్ ఆధ్వర్యంలో నిర్వహణ
- ప్రజల్లో అపోహలు తొలగించేందుకు కసరత్తు
- వినియోగదారులను ఆకర్షించేందుకు యత్నం



జన్ ఔషధీ మందుల షాపు

కడప ఎన్టీఆర్ సర్కిల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తక్కువ ధరలకే ఔషధాలు అందించేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. ప్రస్తుత కాలంలో ఎక్కువ శాతం మంది ఏదోక జబ్బుతో బాధపడుతూ మందులు వాడాల్సిన పరిస్థితి. దీంతో మందుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ప్రతి ఒక్కరి సంపాదనలో అధికభాగం మెరుగైన ఆరోగ్యం కోసం ఖర్చు చేయాల్సి వస్తుంది. దీంతో సామాన్యుల, పేదల పరిస్థితి దారుణంగా తయారవుతోంది. ఆసుపత్రికి వెళ్లాలంటే అప్పు చేయాల్సిన పరిస్థితి. ఈక్రమంలో ప్రభుత్వాలు ఔషధాల ధరలను తగ్గించి కొంతవరకైనా వెసులుబాటు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాయి. ఇందులో భాగంగానే జనరిక్ ఔషధ కేంద్రాలను గత కొన్ని సంవత్సరాలుగా నిర్వహిస్తున్నారు. అయితే వీటికి తగినంత ఆదరణ లేకపోవడంతో కొంతకాలానికి మూతపడాల్సిన పరిస్థితి నెలకొంది. అయినప్పటికి జిల్లాలో జనరిక్ మందుల షాపుల కేంద్రాలు నడుస్తున్నాయి. ప్రస్తుత ప్రభుత్వాలు జనరిక్ మం దుల షాపుల కేంద్రాలను ప్రోత్సహిస్తున్నాయి. జన్ ఔషధీ పేరుతో కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాయి. ఈ షాపుల ద్వారా దాదాపు 70 నుంచి 80శాతం వరకు కొనుగోలు చేసే మందులపై రాయితీ లస్తుంది.

డీసీఎంఎస్ ఆధ్వర్యంలో

వ్యవసాయంలో రైతులు సాగుచేస్తున్న పంటలను ఆశించే చీడ,పీడ పురుగుల నివారణకు మందులను అందించే ఉద్దేశ్యంతో ఏర్పాటైన జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో జన ఔషధ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇంతకుముందే రైతులకు సేవలు అందిస్తున్న సహకార మార్కెటింగ్ సొసైటీతో పాటు సహకార సొసైటీ ఆధ్వర్యంలో జన్ ఔషధీ కేంద్రాల ఏర్పాటుకు సహకార శాఖ చర్యలు తీసుకుంది. అయితే పెండ్లిమర్రి మండలంలోని వెల్లటూరులో గత కొంతకాలం క్రితం ఏర్పాటు చేసిన జన్ ఔషధీ కేంద్రం నష్టాల్లో నడుస్తుండడంతో మూత వేశారు. దీంతో గత ఏడాది జూలైలో ఏర్పాటు చేయాల్సిన జన్ఔషధీ కేంద్రాన్ని డీసీఎంఎస్ తాత్కాలికంగా వాయిదా వేస్తూ వచ్చింది. ఇప్పటి వరకు రైతులకు అవసరమైన ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు అందిస్తూ వస్తున్న డీసీఎంఎస్ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన రైతు భరోసా కేంద్రాల వల్ల వ్యాపారాలు లేకుండా పోయాయి. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయం వల్ల తమకు వ్యాపారం వస్తుందని ఆశించిన డీసీఎంఎస్ సంస్థకు కొంతకాలం నిరాశమిగిలింది. ఎట్టకేలకు గత నెలలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో జన్ ఔషధీ కేంద్రం ప్రారంభానికి నోచుకుంది. ఈ క్రమంలో తమ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జన్ఔషధీ కేంద్రాన్ని బలోపేతం చేసేందుకు డీసీఎంఎస్ అధికార యంత్రాంగా ఆలోచనలు చేస్తోంది. రాబోవు రోజుల్లో జన్ ఔషధీ కేంద్రాల్లో లభించే మందులు సాధారణంగా బయట లభించే మందులతో సమానమేనని... తగినంత ప్రచారం చేపట్టి ముందుకు సాగేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

అవగాహన లేకపోవడమే.

జనరిక్ షాపుల్లో లభించే మందులపై ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడంతోనే వాటి మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది. 2012లోనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అన్న సంజీవిని పేరుతో జనరిక్ మందుల దుకాణాలు ఏర్పాటయ్యాయి. జిల్లాలో 18షాపులను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వీటి నిర్వహణ బాధ్యతలను మహిళా సమైఖ్యలకు అప్పగించడం జరిగింది. వాటిని వెలుగు సిబ్బంది పర్యవేక్షించేవారు. కాలక్రమంలో తగిన ఆదరణ లేకపోవడంతో నష్టాలు రావడం మొదలైంది. దీంతో కొంతకాలానికి వీటిని మూసివేశారు. అయినప్పటికి కొన్నిచోట్ల మహిళా సంఘాల ప్రతినిధులు ఈ షాపులను స్వాధీనం చేసుకొని సొంతంగా నిర్వహిస్తున్నారు. జనరిక్‌పై ప్రజల్లో అవగాహన లేకపోవడం... డాక్టర్లు కూడా ఆ మందులను చీటీలలో రాయకపోవడంతో జనరిక్ కేంద్రాలకు ఆదరణ తగ్గింది. వాస్తవానికి జనరిక్ షాపుల్లో లభించే మందులు నాణ్యమైనవే. గతంలో ఒక కంపెనీ తాము తయారు చేసే మందులపై పూర్తి హక్కు కలిగి ఉంటుంది. ఈ హక్కుకు కొంత గడువు ఉంటుంది. ఆ గడువు ముగిసిన తర్వాత అదే మందును తక్కువ ధరకు విక్రయించే అవకాశం ఉంటుంది. దీంతో జనరిక్ షాపుల్లో తక్కువ ధరకే మందులు లభిస్తున్నాయి. బయట ప్రముఖ కంపెనీలు తయారు చేసే మందులు ధరలతో పోలిస్తే ఈ మందుల ధర తక్కువగా ఉండడంతో నాణ్యత



జన్ ఔషధీ కేంద్రంలో ఫార్మాసిస్ట్

ఉండకపోవచ్చు అనే అపోహ, అనుమానం ప్రజల్లో వ్యక్తమవుతోంది. ఈ కారణం చేతనే జనరిక్ షాపుల్లో లభించే మందులు కొనుగోళ్లకు వినియోగదారులు వెనకడుగు వేస్తున్నారు. ఈక్రమంలో ప్రభుత్వాలు ప్రజల్లో అవగాహన తీసుకొచ్చేందుకు ప్రత్యేక కార్యక్రమాల ద్వారా చర్యలు తీసుకుంటే తప్ప జనరిక్ మందుల షాపుల నిర్వహణ కొనసాగే పరిస్థితి కనిపించడం లేదు.

వినియోగదారులను ఆకర్షించే ప్రయత్నం

జనరిక్ ఔషధీ కేంద్రంలో వ్యాపారం మొదలైంది. జనరిక మందులపై ప్రజల్లో అవగాహన తీసుకువచ్చి వారిని ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నాం. మరిన్ని రకాలైన బ్రాండ్లు తెప్పించి ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నాం. పరిచయమున్న వైద్యుల సహకారంతో వినియోగదారుల సంఖ్యను పెంచడం కోసం ప్రయత్నం చేస్తున్నాం.

-ఖాదర్‌వల్లి, ఇన్‌చార్జి బిజినెస్ మేనేజర్, డీసీఎంఎస్.

పులిపిరికి అరుదైన చికిత్స

- ఆకుపసరుతో నిమిషాల్లో తొలగింపు



పులిపిర్లపై చికిత్స చేస్తున్న దృశ్యం

కడప జిల్లా : డిసెంబర్ 15: పులిపిర్లకు వడియార మల్లికార్జున అరుదైన చికిత్స నందిస్తున్నారు. ఆకుపసరుతో నిమిషాల్లో శరీరంపై ఉన్న పులిపిర్లు తొలగిస్తామంటున్నారు. కడప జిల్లా, కొత్త బస్‌స్టాండ్ ప్రక్కన ఎస్.పి.బంగ్లా ఎదురుగా, హరిత హోటల్, ఎపి టూరిజం కడప నందు ఆయన పులిపిర్లకు చికిత్స అందిస్తున్నారు. ఈ నెల 15, 16, 17 తేదీల్లో మూడు రోజుల పాటు వాటికి చికిత్స అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా ఆదివారం పలువురికి పులిపిర్లు తొలగించారు. సాధారణంగా మనిషిలో 7 రకాలుగా ఈ పులిపిర్లు కనిపిస్తాయన్నారు. ఏ రకమైన పులిపిరి అయినా సరే తాము సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది తక్షణమే తొలగిస్తామన్నారు. అనంతరం అదే పొడి మళ్లీ పులిపిరి తొలగించిన ప్రదేశంలో అద్దుతామన్నారు. సోమ, మంగళవారం రెండు రోజుల్లో మాత్రమే వైద్యం అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. 9849628485 నెంబర్లులోని సంప్రదించాలన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో ఉమ్మడి జిల్లాకు 7వ ర్యాంకు

- 7538 కేసులు పరిష్కారం
- రూ.30,62,35,148లు చెల్లింపు
- జిల్లా ప్రధాన జడ్జి గల్లా శ్రీదేవి

కడప రూరల్, డిసెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు ఈనెల 14న శనివారం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో కడప జిల్లాకు 7వ ర్యాంకు దక్కిందని డీఎల్ఎస్ఏ చైర్మన్, జిల్లా ప్రధాన జడ్జి గల్లా శ్రీదేవి తెలిపారు. ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా ఆయా కోర్టులలో 22 బెంచ్‌లను ఏర్పాటు చేసి మొత్తం 7538 కేసులు పరిష్కరించామన్నారు. ఇందులో 7104 క్రిమినల్ కేసులు, 262 సివిల్ కేసులు, 172 ప్రీలిటిగేషన్ కేసులను పరిష్కరించినట్లు తెలిపారు. వీటిలో కడపలో 2689 కేసులు, ప్రొద్దుటూరులో 1839, రాజంపేటలో 512, రాయచోటిలో 130, బద్వేల్‌లో 253, జమ్మలమడుగులో 1058, సిద్దవటంలో 100, రైల్వే కోడూరులో 185, పులివెందులలో 320, నందలూరులో 211, లక్కిరెడ్డిపల్లెలో 83, కమలాపురంలో 158 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. మొత్తం కేసుల పరిష్కారానికి కక్షిదారులకు రూ. 30,62,35,148లు చెల్లింపులు జరిగాయన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి తోడ్పడిన న్యాయవాదులకు, రెవెన్యూ సిబ్బందికి, పోలీస్ అధికారులకు, ఇన్సూరెన్స్, బ్యాంకు అధికారులు తదితరులకు కృజ్ఞతలు తెలియజేశారు.

ఉమెన్ ప్రీమియం క్రికెట్ లీగ్‌కు శ్రీ చరణి ఎంపిక



కడప స్పోర్ట్స్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉమెన్ ప్రీమియం క్రికెట్ లీగ్‌కు కడపకు చెందిన క్రీడాకారిణి ఎస్.శ్రీచరణి (రూ.55 లక్షలకు) ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు ఎంపికయ్యారు. దీంతో జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎం. భరత్‌రెడ్డి, అవ్వారు రెడ్డి ప్రసాద్ హర్షం వ్యక్తం చేస్తూ ప్రత్యేక అభినందనలు తెలిపారు. ప్రీమియర్ విభాగ పోటీలలో రాణించి తద్వారా జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

జనసంద్రమైన జ్యోతి క్షేత్రం

- ముగిసిన కాశినాయన ఆరాధనోత్సవాలు
- జ్యోతి దర్శనంతో పులకించిన భక్తులు
- కన్నుల పండువగా సాగిన రథోత్సవం

కాశినాయన డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నల్లమల అటవీ ప్రాంతంలోని జ్యోతి క్షేత్రం జనసంద్రమైంది. శనివారం అర్థరాత్రి నిండైన జ్యోతి దర్శనంతో కాశినాయన భక్తులు ఆనందపరవశులయ్యారు. అనంతరం రథో త్సవం వైభవంగా సాగింది. వివరాలిలా.. జ్యోతి క్షేత్రంలో శనివారం కాశినాయన ఆరాధనోత్సవాలు ప్రారంభం కాగా.. ఆదివారం ప్రత్యేక పూజలు, హోమాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో జ్యోతి క్షేత్రం హోరెత్తింది. దట్టమైన అటవీప్రాతంలో వణికిస్తున్న చలిని సైతం లెక్క చేయకుండా భక్తులు శనివారం అర్ధరాత్రి జ్యోతి దర్శనం చేసుకున్నారు. ఆ తర్వాత కన్నుల పండువగా సాగిన కాశినాయన రథోత్సవంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. రెండు రోజుల ఆరాధనలో దాదాపు లక్షమంది భక్త లు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. గతంలో నిర్వహించిన ఆరా ధనల కంటే ఈఆరాధనకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చినట్లు చెబు తున్నారు. రెండు రోజులూ నిరంతరాయంగా భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆరాధనకు వచ్చిన భక్తులే అన్నింటతామై కార్యక్రమా న్ని జయప్రదం చేశారు. ఆరాధనలో పాల్గొన్న భక్తులు భారీగా బియ్యం, సరుకులు అందజేశారు. ఆలయ నిర్వాహకులు, పోలీసులు, ఆర్టీసీ అధికారులు, హెల్త్ డిపార్ట్‌మెంట్ సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేయడంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆరాధనోత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి.

లింగాలలో...: స్థానిక వనంబావి శివాలయంలో ఆదివారం కాశినాయన ఆరాధన మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో టీడీపీ పులివెందుల ఇన్‌చార్జి బీటెక్ రవి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రూ.50వేలు నగదు వితరణగా అందించారు. ఈ సందర్భంగా మహిళలు నిర్వహించిన కోలాటం, భజన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం బండలాగుడు పోటీలను సారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ప్రారంభించి... ప్రథమ స్థానంలో నిలిచిన ఎడ్ల యజ మానికి రూ.70వేల నగదు బహుమతి అందించారు. రెండు, మూడు, నాలుగు స్థానాల్లో నిలిచిన వారికి రూ.50వేలు,రూ.40వేలు, రూ.30వేలు నగదు బహుమతులను అందజేశారు.



కాశినాయన రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



భక్తులకు దర్శనమిచ్చిన కాశినాయన జ్యోతి వెలుగు

ఖాజీపేటలో...: కడప- కర్నూలు జాతీయ రహదారిలోని పత్తూరు వద్ద గల శ్రీకాశిరెడ్డినాయన 28వ ఆరాధనోత్సవాలు ముగిశాయి. ఉదయం స్వామివారికి మహానైవేద్యం సమర్పించారు. పది గంటల నుంచి తాళం భజన ప్రారంభించారు. ఈ భజనలో 20 గ్రామాల భజన బృందాలు పాల్గొన్నాయి. గెలుపొందినవారికి బహుమతులు అందజేశారు.

యూసీఐఎల్ ఉద్యోగి కాలువలో పడి గల్లంతు?

- గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు

పులివెందుల టౌన్, డిసెంబర్ 15 (ఆంధ్ర జ్యోతి): యురేనియం కర్మాగారంలో పనిచేస్తున్న పాలగిరి రామాంజనేయులు (28) అనే ఉద్యోగి కాలువలో పడి గల్లంతయ్యాడు. ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లిన రామాంజనేయులు పులివెందుల పట్టణ పరిధిలోని నల్లపురెడ్డిపల్లి రహదారి సమీపంలో ఉన్న కాలువ గట్టున మోటార్ బైక్ దగ్గర చెప్పులు వదిలి కనిపించలేదు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. కాలువలో పడి గల్లంతు అయి ఉండవచ్చని పోలీసులు, ఫైర్ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. రామాంజనేయులు యురేనియం కర్మాగారంలో ఏఎండీ ఆపరేటర్ (ఔట్ సోర్సింగ్ ఉద్యోగి)గా పని చేస్తున్నాడు. సొంత గ్రామం వేముల మండలం మబ్బు చింతలపల్లి. ప్రస్తుతం పట్టణంలోని ఎరుగుడిపల్లెలో నివాసం ఉంటున్నారు.

16 నుంచి తైక్వాండో శిక్షణ తరగతులు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయ వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థినులకు ఈనెల 16 నుంచి 21వ తేదీ వరకు క్యాంపస్‌లో తైక్వాండో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు పీజీ కళాశాల ప్రధానాచార్యులు, హాస్టళ్ల చీఫ్ వార్డన్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి తెలిపారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం గంటన్నర పాటు నిపుణులు శిక్షణ ఇస్తారని వివరించారు. హాస్టల్స్ విద్యార్థినులు హాజరయ్యేలా చూడాలని అన్ని విభాగాల అధిపతులు, కోఆర్డినేటర్‌లకు సూచించారు.

గురుకుల పాఠశాల మరమ్మతులకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్

- ఎమ్మెల్యే చొరవతో రూ.62 లక్షలు మంజూరు

కొండాపురం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): చౌటిపల్లె వద్ద ఉన్న బాలికల గురకుల పాఠశాల మరమ్మ త్తులకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. పాఠశాలలో ఇటీవల ఇద్దరు విద్యార్థులు పాముకాటుకు గురైన సంగతి తెలిసిందే. గురుకుల పాఠశాలలో సుమా రు 600 మంది విద్యార్థులు ఇంటర్ వరకు చదువు తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పాఠశాలలో మెయింటెనెన్స్ పనులు గాలికివది లేసింది. దీంతో పాఠశాలలో బాత్‌రూమ్‌లు, తలుపులు, కిటికీలు అధ్వానంగా తయారై. పాములు, కోతులు పాఠశాలలోకి వస్తుండడంతో విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈ పరిస్థితిపై ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో తక్షణం మెయింటెనెన్స్ పనులు చేపట్టడానికి రూ.62లక్షలు మంజూరయ్యాయి. త్వరలో పనులను చేపట్టనున్నట్లు మాజీ సర్పంచ్, కాంట్రాక్టర్ రామలింగేశ్వర రెడ్డి తెలిపారు.

విలీన ఫలాలను కార్మికులకు అందజేయాలి

- నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు



రెడ్డప్ప రెడ్డిని సన్మానిస్తున్న నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు

పీలేరు, డిసెంబరు 15 (ఆంధ్ర జ్యోతి): ప్రభుత్వంలోకి విలీనం చేసుకున్న అనంతరం ఆర్టీసీ (ప్రస్తుతం పీటీడీ) కార్మికులకు అందాల్సిన ప్రయోజనాలను గత ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని.. వాటిని అందించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి పేర్కొన్నారు. నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ పీలేరు డిపో గౌరవాధ్యక్షుడిగా పీలేరు సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు యల్లెల రెడ్డప్ప రెడ్డి నియామక సభ ఆదివారం పీలేరులో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీని ప్రభుత్వంలోకి విలీనం చేయడం ద్వారా 58 వేల మంది కార్మికులకు ఎన్నో ప్రయోజనాలు లభిస్తాయని గత ప్రభుత్వం ఆశ పెట్టిందన్నారు. విలీన ప్రక్రియ పూర్తయి ఏళ్లు గడుస్తున్నా ప్రయోజనాలు మాత్రం అందడం లేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వమైనా తమను పట్టించుకుని పీటీడీ కార్మికులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, మెరుగైన హెల్త్ పాలసీ అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాస రావు మాట్లాడుతూ పీటీడీ ఉద్యోగులకు పీఆర్సీ వేయాలని, 55 ఏళ్లు నిండిన వారికి ఓడీ ఇవ్వాలని, ఓటీ డ్యూటీలు రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రెడ్డప్ప రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో తనను ఎన్నుకున్నం దుకు కార్మికులకు కృతజ్ఞతలు తెలిపారు. నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు చెన్నా రెడ్డి, పెరుమాళ్, బీఎస్ బాబు, వేలు, భాస్కర్, ఎంఎస్ రావు, పీఎస్ఎం రాజు, వినోద్ బాబు, సీవీ రమణ, షఫీ, తదితరులు పాల్గొన్నారు. గౌరవాధ్యక్షుడిగా ఎన్నికైన యల్లెల రెడ్డప్ప రెడ్డిని పలువురు టీడీపీ నేతలు ఘనంగా సన్మానించారు.

శ్రీకృష్ణ దేవరాయకాలనీలో చోరీ

- 15తులాల బంగారం, రూ 4.50లక్షల నగదు, రెండు కిలోల వెండి అపహరణ

కడప(క్రైం), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని శ్రీకృష్ణ దేవరాయకాలనీలోని ఓ వ్యక్తి ఇంట్లో దొంగలు పడి బంగారం, నగదు, వెండి వస్తువులను అపహరించారు. బాధితుడు రాజశేఖర్ హౌసింగ్ బోర్డు కాలనీలో ప్లే స్కూల్ నిర్వహిస్తున్నాడు. శని, ఆదివారం రెండు రోజులు సెలవులు కావడంతో సొంత ఊరు చక్రాయపేటకు కుటుంబంతో కలిసి వెళ్లారు. దొంగలు అతని ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న 15 తులాల బంగారు నగలు, రెండు కిలోల వెండి సామగ్రి, రూ.4.50 లక్షల నగదును అపహరించారు. సమాచారం తెలిసిన చిన్నచౌకు సీఐ ఓబులేసు, ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. చోరీ ఘటనను పరిశీలించి.. క్లూస్ టీంను పిలిపించి దొంగల వేలి ముద్రలను సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అపూర్వం పూర్వ విద్యార్థుల సమ్మేళనం



అపూర్వ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

నందలూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1983 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల సమ్మేళనం ఆదివారం అపూర్వంగా జరిగింది. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాలలో ఉన్న వారంతా నాటి మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. ఆనందోత్సాహాలతో గడిపారు. అనంతరం అప్పటి గురువులు జీవీ కృష్ణయ్య, గానుగపెంట హనుమంతరావు, ఆకుల వెంకటసుబ్బయ్య, రామసుబ్బన్న, లక్ష్మీకాంతమ్మలను ఘనంగా సత్కరించారు. అనారోగ్యంతో బాధపడుతున్న తమ తోటి విద్యార్థి సీహెచ్ నాగేశ్వరరావుకు రూ.25వేలు, చనిపోయిన మరో విద్యార్థి సుబ్రమణ్యం కుటుంబానికి రూ.25 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సమ్మేళనంలో మాజీ ఏజీపీ నిర్వాహకులు షేక్ మహ్మద్‌అలీ, షైనుద్దీన్, కోడూరు సుమన, సువర్ణకుమార్ తదితర పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులలో ఉత్తీర్ణత సులభతరం

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 15 (ఆంధజ్యోతి): శిక్షణ తరగతుల ద్వారా ఉత్తీర్ణత సులభతరం అవుతుందని ఏపీ జేఏసీ జిల్లా చైర్మన్ శ్రీనివాసులు, ఏపీ ఎన్జీఓ జిల్లా కార్యదర్శి రవి కుమార్ తెలిపారు. ఆదివారం కడప ఎన్జీఓ భవన్‌లో ఏపీటీఎఫ్ అమరావతి ఆధ్వర్యంలో డిపార్ట్‌మెంటల్ పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన వారు మాట్లాడుతూ ఉద్యోగులు ఉపాధ్యాయులు డిపార్ట్‌మెంటల్ పరీక్షలు సులభంగా ఉత్తీర్ణత కావాలంటే శిక్షణా తరగతులలో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. డిపార్ట్‌మెంటల్ పరీక్షలు ప్రశ్నాపత్రంపై అవగాహన పెంచుకోవాలని చెప్పారు. భవిష్యత్తులో ఉద్యోగులకు వృత్తినైపుణ్య సదస్సులు కూడా ఏర్పాటు చేయాలని కోరారు.


ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమం దృష్ట్యా చైతన్య సదస్సులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. డిపార్ట్‌మెంటల్ పరీక్షలకు కావాల్సిన అభ్యసనా ప్రక్రియ గురిం చి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ అమరావతి నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, సత్యం, వీరప్రసాద్‌తో పాటు ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ టెన్నిస్ రాష్ట్ర జట్టు కోచ్‌గా పోలంకి గణేశ్‌బాబు



నందలూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌బాల్ టెన్నిస్ ఆంధ్రప్రదేశ్ జట్టు కోచ్, మేనేజర్‌గా టంగుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ పోలంకి గణేష్ బాబు నియమితులైనట్లు ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని భోపాల్ (దేవాస్)లో ఈనెల 18 నుంచి 26వ తేదీ వరకు జాతీయస్థాయి అండర్-14, అండర్-17, అండర్-19 విభాగాల్లో ఈ పోటీలు జరగనున్నాయి. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఆయనను అభినందించారు.

గండికోట నుంచి 100 క్యూసెక్కులు విడుదల



మెయిన్‌కెనాల్ నుంచి విడుదలవుతున్న నీరు

కొండాపురం, డిశంబరు 15 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు నుంచి జీఎన్ ఎస్ఎస్ మెయిన్‌కెనాల్ ద్వారా 100 క్యూసెక్కులు వదులు తున్నట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. కమలాపురం రైతుల అవసరాల దృష్ట్యా ఈ నీటిని వదులుతున్నామన్నారు. కాగా ప్రస్తుతం ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో లేదన్నారు. ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 26.07 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ తెలిపారు.

- పర్తికోట, నాయనిచెరువుపల్లెల్లోని 20 గ్రామాలకు నోచుకోని ప్రభుత్వ సేవలు
- సచివాలయాలకు వెళ్లాలంటే 6 నుంచి 16 కిలో మీటర్లు ప్రయాణం
- ఇబ్బందులు పడుతున్న పల్లెవాసులు

కలగానే సచివాలయ సేవలు


సచివాలయానికి నోచుకోని పర్తికోట గ్రామం

ములకలచెరువు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆ రెండు గ్రామాలకు సచివాలయ సేవలు కలగానే మిగులుతున్నాయి. ప్రభుత్వ సేవలు పొందాలంటే కిలో మీటర్ల మేర ప్రయాణం చేయాల్సి వస్తోంది. దీంతో ప్రజలు పడుతున్న కష్టాలు వర్ణణాతీతంగా మారాయి. గత వైసీపీ ప్రభుత్వం ఈ రెండు గ్రామాలకు మొండిచెయ్యి చూపి సచివాలయాలు ఏర్పాటు చేయకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. దీంతో ప్రభుత్వ సేవలు ఈ రెండు గ్రామాలకు దూరంగా మారాయి. ములకలచెరువు మండలంలోని పర్తికోట, నాయనిచెరువుపల్లె గ్రామాల్లో ఇంత వరకు సచివాలయాలు ఏర్పాటు కాలేదు. ప్రభుత్వ సేవలు పొందేందుకు పర్తికోట గ్రామ పంచాయతీ ప్రజలు పక్కనున్న దేవళచె రువు సచివాలయానికి నాయనిచెరువుపల్లె గ్రామ పంచాయతీ ప్రజలు కదిరినాథునికోట సచివాల యానికి వెళ్లాలంటే ఆయా గ్రామాల ప్రజలు సుమారు అరు నుంచి 16 కిలో మీటర్లు దూరం వెళ్ళాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వమైనా తమ గ్రామాల్లో సచివా లయాలు ఏర్పాటు చేసి ప్రభుత్వ సేవలు అందే లా చూడాలని ప్రజలు ఎదురు చూస్తున్నారు.

దేవళచెరువు సచివాలయానికి 12 గ్రామాలు

ములకలచెరువు మండలంలోని దేవళచెరువు గ్రామ పంచాయతీని గత వైసీపీ ప్రభుత్వం రెండుగా విభజించింది. పర్తికోట గ్రామం కేంద్రంగా కొత్తగా పంచాయతీ ఏర్పాటు చేసింది. పర్తికోట పంచాయతీ పరిధిలో పర్తికోట, ఆవులవారిపల్లె, చిటికివారిపల్లె, కన్నెమడుగువారిపల్లె, దుగుసానివారిపల్లె, వసంతరాయనిపల్లె, గుడిసెవారిపల్లె, నీరుగట్టువారిపల్లె, గోళ్ళవారిపల్లె, ఎర్రంరెడ్డిగారిపల్లె, మావిళ్ళవారిపల్లె, మామిడిగుంపులవారిపల్లె ఉన్నాయి. గ్రామ పంచాయతీ ఏర్పాటు చేసినా ఇక్కడ సచివాలయం ఏర్పాటు చేయలేదు. దీంతో 12 గ్రామాల ప్రజలు దేవళచెరువు సచివాలయానికి వెళ్ళాల్సి వస్తోంది. ఎర్రరెడ్డిగారిపల్లె, మావిళ్లవారిపల్లె గ్రామస్థులు పనుల కోసం దేవళచెరువు సచివాలయం వెళ్ళాలంటే రానూ పోను 16 కిలో మీటర్లు. మిగిలిన గ్రామాల ప్రజలు రానూ, పోనూ ఆరు నుంచి 15 కిలో మీటర్ల దూరం వెళ్లాల్సి వస్తోంది. 11 గ్రామాల ప్రజలకు బస్సు సౌకర్యం లేదు. పర్తికోట నుంచి దేవళచెరువుకు బి.కొత్తకోట నుంచి తంబళ్లపల్లెకు నడిచే రెండు బస్సులు ఉదయం, సాయంత్ర మాత్రమే ఉండడంతో దేవళచెరువు సచివాలయం వెళ్లేందుకు ప్రజలు ఆటోల్లో ప్రయాణించాల్సి వస్తోంది. ఇక వృద్ధులు, దివ్యాంగులు సచివాలయానికి వెళ్లాలంటే సాహసం చేయాల్సి వస్తోంది.

కదిరినాథునికోటకు 8 గ్రామాల ప్రజలు

మండలంలోని నాయనిచెరువుపల్లెలో కూడా గ్రామ సచివాలయం లేదు. దీంతో నాయని చెరువుపల్లె గ్రామ పంచాయతీ పరిధిలో నినాయనిచె రువుపల్లె, ఉంగరాళ్లవారిపల్లె, కోటిరెడ్డిగారిపల్లె, వగ్గిపల్లె, గుండాలవారిపల్లె, దాశిరెడ్డిగారిపల్లె, పోకనాటివారిపల్లె, కొత్తిళ్ల గ్రామాలు ఉన్నాయి. ఎనిమిది గ్రామాల ప్రజలు సచివాలయం లేక అవస్థలు పడుతున్నారు. పంచాయతీ కేంద్రమైన నాయనిచెరువు గ్రామ ప్రజలు కదిరినాథునికోట సచివాలయానికి వెళ్ళాలంటే మూడు కిలో మీటర్ల దూరంలో ఉన్న ములకలచెరువుకు వచ్చి మళ్లీ మూడు కిలో మీటర్ల దూరం వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. రానూ పోనూ 12 కిలోమీటర్లు ఉంది. కదిరినాథునికోటకు వెళ్ళాలంటే బస్సులు, ఆటోలు ఉండవు. ద్విచక్రవాహనాలు ఉన్న వారిని బ్రతిమలాడి వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. వృద్ధులు, దివ్యాంగులు కదిరినాథునికోట సచివాలయం వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఇదే పంచాయతీలోని పోకనావారిపల్లె, గుండాలవారిపల్లె ప్రజలు సచివాలయంకు వెళ్లాలంటే రాను పోను 15 కిలో మీటర్లకు పైగా రాకపోకలు సాగించాలి. ఉంగారా ళ్లపల్లె, వడ్డిపల్లె గ్రామస్థులు కూడా తొమ్మిది కిలోమీటర్లు దూరం వెళ్లాల్సి ఉంది.

సచివాలయం వెళ్లాలంటే కష్టాలే..



పర్తికోటలో గ్రామ సచివాలయం లేకపోవడంతో పనుల కోసం దేవళచెరువు సచివాలయం వెళ్లేం దుకు బస్సు సౌకర్యం కూడా సరిగా లేదు. ఆటోలను ఆశ్రయిస్తున్నాం. ప్రభుత్వ సేవ లు సరిగా అందడం లేదు. కూట మి ప్రభుత్వమైనా సచివా లయం ఏర్పాటు చేసి కష్టాలు తీర్చాలి.

-సాంబశివారెడ్డి, పర్తికోట, ములకలచెరువు

సచివాలయ సేవలు అందడం లేదు



మా గ్రామంలో సచివాలయం లేకపోవడంతో సేవలు అందడం లేదు. ఇక్కడ ఎందుకు సచివాయం ఏర్పాటు చేయలేదో తెలియడు. కదిరినాథు నికోట సచివాలయం వెళ్ళాలంటే ఇబ్బందు లు పడుతున్నాం. బస్సులు, ఆ టోలు కూడా లేవు. ములకలచెరు వుకు వచ్చి అక్కడ ఆటోలు బాడుగకు మాట్లాడు కుని వెళ్తున్నాం.

-సరస్వతి, నాయనిచెరువుపల్లె

సచివాలయం ఏర్పాటుకు ప్రతిపాదనలు



పర్తికోట, నాయనిచెరువుపల్లె గ్రామాల్లో సచివా లయం ఏర్పాటుకు, ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతాం. గతంలో రెండు గ్రామాల్లో ఎందుకు సచివాలయాలు ఏర్పాటు చేయలేదో రికార్డులు పరిశీలిస్తాం. ఇక్కడ సచివాలయాలు లేని విషయాన్ని ఉన్నతాధికారు ల దృష్టికి కూడా తీసుకెళ్తాం.

-హరినారాయణ, ఎంపీడీవో, ములకలచెరువు

విజన్ 2047పై సీఎంతో గురుప్రసాద్ చర్చ


సీఎం చంద్రబాబుతో మాట్లాడుతున్న గురుప్రసాద్

మదనపల్లె టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేప ట్టిన 2047 స్వర్ణాంధ్ర సాధనలో చేప ట్టాల్సిన అంశాలపై సీఎం చంద్రబాబు నాయుడుతో ఎస్వీ యూనివర్సిటీ మాజీ పాలక మండలి సభ్యుడు రాటకొండ గురుప్రసాద్ చర్చించారు. శనివారం రాత్రి మంగళగిరిలో టీడీపీ జాతీయ కార్యాలయంలో చంద్రబాబు ను గురుప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా గురుప్రసాద్ రాష్ట్రంలో ఉన్నత విద్యాశాఖ విధి, విధానాలపై కూడా సీఎం దృష్టికి తీసుకెళ్లారు.

అధైర్య పడొద్దు..బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

- రైతు పిల్లలకు చదువుకు అయ్యే రూ.4లక్షల ఖర్చును భరిస్తా
- తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లె జయచంద్రారెడ్డి


రైతు కుటుంబాన్ని పరామర్శిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి

ములకలచెరువు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): అధైర్య పడొద్దు...అండగా ఉంటానని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లె జయచంద్రారెడ్డి బాధిత రైతు కుటుంబానికి భరోసా ఇచ్చారు. మండలంలోని వేపూరికోట పంచాయతీ చీకుచెట్టుపల్లెలో అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న రైతు బయ్యారెడ్డి కుటుంబాన్ని ఆదివారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లెలోని ఓ ప్రైవేటు కళాశాల హాస్టల్‌లో ఉంటూ ఇంటర్మీడియట్ చదువుతున్న రైతు ఇద్దరు కూమార్తెలు శ్రీతేజ, సింధులకు రెండేళ్లకు అయ్యే రూ.4లక్షల ఖర్చును భరిస్తానన్నారు. రైతు కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందేలా చూస్తానన్నారు. అనంతరం రైతు కుమార్తెలు చదువుతున్న కళాశాల యాజమాన్యంతో ఫోన్‌లో మాట్లాడి తానే చదువుకు అయ్యే ఖర్చును చెల్లిస్తానని చెప్పారు. ఆయన వెంట నియోజకవర్గ ప్రచార సమన్వయకర్త సీడు మల్లికార్జుననాయుడు, ఎంపీటీసీ శ్రీనివాసులురెడ్డి, నాయకులు మూగి రవిచంద్ర, భాస్కర్‌రెడ్డి, అంజనేయరెడ్డి, రెడ్డెప్ప, శ్రీరాములురెడ్డి, రమణారెడ్డి, శంకర్‌రెడ్డి, బాలాజీ, బయ్యారెడ్డి, కృష్ణప్ప తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేస్తే సహించేదిలేదు


టీడీపీ కార్యకర్తలతో మాట్లాడుతున్న సీనియర్ నాయకుడు బాబురెడ్డి

నిమ్మనపల్లి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్తలను ఇబ్బందుకు గురిచేస్తే చూస్తూ ఊరుకొనేది లేదని మదనపల్లి నియోజకవర్గ నాయకుడు బాబురెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని ముష్టూరు పంచాయతి దిగువపల్లిలో బాబురెడ్డి మాట్లాడుతూ గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వంలో టీడీపీ కార్యకర్తలు ఎన్నో ఇబ్బందులకు గురై లేనిపోని కేసులలో ఇరుక్కున్నారన్నారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సంబరపడ్డ కార్యకర్తలను గుర్తించేవారు లేరని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు కార్యకర్తలకు ఉన్న అవసరాన్ని తెలుసుకొని మసలుకోవాలని తెలిపారు. టీడీపీ కార్యకర్తలను హింసిస్తే చూస్తూ ఊరుకొనేది లేదని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వెంకటరమణ, బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మన్న, సర్పంచ్‌లు మల్లప్ప, రెడ్డెప్ప నాయకులు రామకృష్ణ, గోపాలక్రిష్ణ, బాస్కర్‌రెడ్డి, మల్లికార్జున, విజయ్, వెంకటక్రిష్ణ, శ్రీనివాసులు, శంకర, చంద్ర, చంద్రాయుడు పాల్గొన్నారు.

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను అరికట్టాలి


పీలేరులో ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ సంఘాలు

పీలేరు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో హిందువులు, హిందూ ఆలయాలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని పీలేరు వీహెచ్‌పీ, ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా వీహెచ్‌పీ, ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం పీలేరు లో హిందువులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడు తూ హిందూ మతం ఒక జీవన విధానమని, దానిపై దాడి మానవ మనుగడపై దాడి చేసినట్లేనన్నారు. బంగ్లాదేశ్‌లో ఉన్న హిందువులను రక్షించడమే కాకుండా అల్లరి మూకల దాడుల్లో ధ్వంసమైన ఆలయాల పునరుద్ధరణకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని వారు కోరారు. ప్రభుత్వ ఆసుపత్రిలోని రౌద్రాల అంకాళమ్మ ఆలయం నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించి నాలుగు రోడ్ల కూడ లిలో మానవహారం ఏర్పాటు చేశారు. బంగ్లాదేశ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

కార్మికసంక్షేమ బోర్డు పునరుద్ధరణ కోసం ఉద్యమిస్తాం


సమావేశంలో మాట్లాడుతున్న సలీంబాషా

బి.కొత్తకోట, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): భవననిర్మాణ కార్మికుల సంక్షేమబోర్డు పునరుద్ధరణ కోసం ఉద్యమిస్తామని ఏపీ భవననిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సలీం బాషా పేర్కొన్నారు. ఆదివారం బి.కొత్తకోటలోని కార్యాలయంలో తాపీ మేస్త్రీల సమావేశం జరిగింది. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం కార్మికుల నడ్డి విరిచే విధంగా భవననిర్మాణ కార్మికుల సంక్షేమబోర్డును రద్దుచేసి తీవ్ర అన్యాయం చేసిందన్నారు. అయితే తాము అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటుచేసి, కోటిరూపాయలు బోర్డుకు జమచేస్తామని డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ హామీ ఇచ్చినా ఇంతవరకు అమలుకాలేదన్నారు. ప్రభుత్వం వెంటనే పెండిగ్‌లో ఉన్న కార్మికుల క్లైములను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వేణు గోపాల్‌రెడ్డి, రామాంజి, ఆదినారాయణ, పావన్న, ప్రభాకర్ ,రమణ పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదుతో కార్యకర్తలకు భరోసా


టీడీపీ సభ్యత్వ నమోదు చేయిస్తున్న పార్టీ క్రిస్టియన్ మైనార్టీ నేత జాన్‌బాబు

మదనపల్లె టౌన్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదులో కార్యకర్తలకు భరోసా వుంటుందని టీడీపీ క్రిస్టియన్ నాయకుడు బోనాసి జాన్‌బాబు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక నీరుగట్టువారిపల్లె చౌడేశ్వరి కళ్యాణమండపం వద్ద జాన్‌బాబు ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాన్‌బాబు మా ట్లాడుతూ రామారావు కాలనిలో నిర్వహించిన సభ్యత్వ నమోదు విజయవంతం అయ్యిందని, ఈ క్రమంలో చౌడేశ్వరి కళ్యాణమండపం వద్ద కూడా సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే సూచించారన్నారు. ఇందులో భాగంగా ఈ ప్రాం తంలో కూడా సభ్యత్వ నమోదు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నరేష్, సురేంద్ర, సుధాకర్, రాజేంద్ర, జయరామ్, లక్ష్మిరెడ్డి, శ్రీనివాసులు, ప్రమీల, పద్మావతి, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముదివేడు క్రాస్‌లో తపాలా సేవలు ప్రారంభం

కురబలకోట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముదివేడు క్రాస్‌లో తపాలా సేవలను చిత్తూరు డివిజన్ పోస్ట ల్ సూపరింటెండెంట్ బసవంత్ లక్ష్మణ్ ఆదివారం ప్రారంభించా రు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మా ట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం ముదివేడు క్రాస్‌లో తపాలా బ్రాం చ్‌ను ఏర్పాటు చేశామని ఈ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్డెప్ప, రమణ, వెంకట్రమణారెడ్డి పాల్గొన్నారు.

ఆరుగురిపై కేసు నమోదు

కురబలకోట, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగళ్ళు సమీపంలో పోలీస్ స్టేషన్‌కు కేటాయించిన స్థలంలో రోడ్డు వేయడానికి ప్రయత్నించారని 6మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ పేర్కొన్నారు. స్థలంలో రోడ్డు వేయడానికి ఎక్స్‌కవేటర్‌తో చదును చేస్తుండగా అడ్డుకుని అందుకు పాల్పడిన వారిపై కేసు నమోదు చేశామన్నారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన ఎన్ఆర్ఐ లోకేశ్ కొణెదల


మంత్రి లోకేశ్‌తో ఎన్ఆర్ఐ లోకేశ్

మదనపల్లె టౌన్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మానవ వనరులశాఖ మంత్రి నారా లోకేశ్‌ను టీడీపీ ఎన్ఆర్ఐ విభాగం ప్రతినిధి మదనపల్లెకు చెందిన లోకేశ్ కొణెదల మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం రాత్రి అమరావతిలో మంత్రిని కలసిన ఎన్ఆర్ఐ లోకేశ్ ఇటీవల అమెరికా పర్యటనలో నారా లోకేశ్ గూగుల్ ప్రతినిధుల చర్యలు సఫలం కావడం, గూగుల్ ప్రతినిధులు రాష్ట్ర ప్రతినిధులతో ఒప్పందం చేసుకోవడం శుభపరిణామమన్నారు. దీంతో పాటు పలు రాజకీయాంశాలపై చర్చించినట్లు లోకేశ్ కొణెదల చెప్పారు.

వేర్వేరు కారణాలతో ఇద్దరు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె అర్బన్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): వేర్వేరు కారణాలతో ఇద్దరు ఆత్మహత్యకు పాల్పడి మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో ఆదివారం చికిత్స పొందుతున్నారు. మదనపల్లె మండలం, బాలాజీ కాలనీకి చెందిన కె. సురేంద్ర భార్య సీపీ మమత(27) భర్తపై గొడవపడి ఇంట్లోని లైజాల్ తాగి ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలుసుకున్న భర్త వెంటనే మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించగా ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఆమెకు ఐదేళ్ల కుమారు డు ఉన్నారు. మదనపల్లె తాలుకా ఎస్ఐ చంద్ర మోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే తంబళ్లపల్లె మండలం, కోటకొండకు చెందిన నరసింహులు కుమా రుడు కె.హరిబాబు(26)కడుపునొప్పి తాళలేక పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆపస్మారక స్థితిలో పడిఉన్న యువకుడిని స్థానికులు చికిత్స కోసం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు తంబళ్లపల్లె పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమజంట తల్లిదండ్రులకు పోలీసుల కౌన్సెలింగ్

మదనపల్లె అర్బన్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక రామారావు కాలనీకి చెందిన ప్రేమ జంట తల్లిదండ్రులకు ఆదివారం మదనపల్లె టూటౌన్ పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. రామారావు కాలనీకి చెందిన నరసింహులు కుమారుడు కాలవపల్లె తరుణ్(21), అదే ప్రాంతానికి చెందిన హనుమంత్‌నాయక్, సుబ్బలక్ష్మి కుమార్తె పూజిత(20) ప్రేమించుకున్నారు. ఇద్దరు మేజర్లు అయిన కారణంగా ఈ నెల 13న తేదీన తిరుపతి సమీపంలో ఓ ఆలయంలో వివాహం చేసుకున్నారు. వారు వెంటనే మదనపల్లె టూ టౌన్ పోలీసులను ఆశ్రయించి మా తల్లిదం డ్రుల నుంచి రక్షణ కావాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏఎస్ఐ వెంకటరమణ వారి తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి వారు మేజర్లు వారి ఇష్టప్రకారం నడుచుకునే హక్కు ఉందని కౌన్సెలింగ్ ఇచ్చారు.

ప్రమాదవశాత్తు మిద్దెపై నుంచి జారి పడి వ్యక్తి మృతి

పెద్దతిప్పసముద్రం డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవ శాత్తు మిద్దె పై నుంచి జారి పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన పెద్దతిప్పసముద్రం మండలంలో చోటు చేసుకుంది. గ్రామస్థులు, కుటుంబీకులు అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. .సంపతికోట గ్రామానికి చెందిన కానుగమాకుల సుధాకర్ 38) మిద్దె పైన పనులు చేసుకుంటుండగా ప్రమాదవ శాత్తు పైనుంచి జారి కిందకు పడడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన కుటుంబీకులు సుధాకర్‌ను ఆసుపత్రికి తరలించే లోపే అతడు మృతి చెందాడన్నారు. ఈ విషయంపై పీటీఎం ఎస్ఐ రవికుమార్‌ను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు. మృతుడు సుధాకర్ కు భార్య రత్నమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పీలేరు సంతలో నాటుకోళ్ల సందడి!

- సంక్రాంతి నేపథ్యంలో పెరిగిన కొనుగోళ్లు


పీలేరు సంతకు వచ్చిన నాటుకోళ్లు

పీలేరు, డిసెంబరు 15: పీలేరు వారపు సంతలో ఆదివారం నాటు కోళ్లు, కాసులు కురిపించే పందెం పుంజులు సందడి చేశాయి. అటు రైతులు, ఇటు వ్యాపారులు పెద్దఎత్తున రావడంతో సంత ప్రాంగణంలో కోలాహలం నెలకొంది. సంక్రాంతి పండుగ వస్తున్న నేపథ్యంలో ఆదివారం జరిగిన సంతకు వ్యాపారులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. పీలేరుతోపాటు సదుం, కలికిరి, పులిచెర్ల, పుంగనూరు, రాయచోటి ప్రాంతాల్లోని కోళ్ల పెంపకందారులు తమ కోళ్లు, పుంజులను సంతకు తెచ్చారు. ఒక్కో నాటు కోడి రూ.600 నుంచి రూ.1200ల దాకా పలుకగా పందెం పుంజులు మాత్రం వాటి రకాన్ని బట్టి ఒక్కొక్కటి రూ.వేయి నుంచి రూ.7 వేల దాకా ధర పలికాయి. పీలేరు సంతలో కొనుగోలు చేసిన పుంజులను కొంత కాలం బాగా మేపి ఉభయ గోదావరి జిల్లాలు, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో జరిగే సంక్రాంతి కోడిపందేలలో స్వంతంగా పోటీకి దింపడమో లేక పందెంరాయుళ్లకు అమ్మడమో చేస్తారని స్థానిక వ్యాపారులు తెలిపారు. సంక్రాంతి పండుగ సమీపించే కొద్దీ పీలేరు సంతలో పుంజుల విక్రయం జోరందుకుంటుందని స్థానిక పెంపకందారులు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



పెద్దమండ్యం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) పెద్దమండ్యం మండలం వెలిగల్లు హైస్కూల్‌లో ఆదివారం 1990-91 సంవత్సరం పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో తమకు పాఠాలు చెప్పిన గురువుల ఆ రోజుల్లో పాఠశాలలో గడిపిన తీపి గుర్తులను నెమరువేసుకుని అందరూ ఆనందంగా గడిపారు. అనంతరం హిందిపండిట్‌గా పని చేసిన విశ్రాంత ఉపాధ్యాయుడు సాహెబ్‌పీర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థులు హైకోర్టు న్యాయవాది ఎన్. రాజారెడ్డి, జ్యోతి, మాధవి, సుజాత, సుధాకరరెడ్డి, షబ్బీర్, సాంబశివా, రామచంద్రరెడ్డి, రెడ్డప్పరెడ్డి 25 మంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


ములకలచెరువులో పూర్వ విద్యార్థుల సందడి



ములకలచెరువు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని బురకాయలకోట జడ్పీహైస్కూల్‌లో ఆదివారం పూర్వవిద్యార్థులు సందడి చేశారు. పాఠశాలలో 1993-94లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు 30 ఏళ్ల తరువాత కలుసుకున్నారు. దీంతో వారి సంతోషానికి అవధులు లేకుండా పోయింది. పూర్వ విద్యార్థులు అందరూ తరగతి గదిలో కూర్చొని చదువుకున్న సమయంలో చేసిన అల్లరి పనులు గుర్తు చేసుకున్నారు. తమకు చదువు చెప్పిన గురువులు సురేంద్రరెడ్డి, సత్తార్‌బేగ్, చంద్రశేఖర్‌లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రమేష్, సురేష్‌రెడ్డి, బావాజీ, దామోదర, రఘు, నాగరాజు ఆచారి, శివమ్మ, మొహరున్నిస్సా, గీతాభవానీ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పౌర్ణమి వేడుకలు

వాల్మీకిపురం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం మండల వ్యాప్తంగా ఆదివారం పౌర్ణమి వేడుకలను వైభవంగా జరుపుకున్నారు. పట్టణ పడమర పొలిమేరల్లోని ధర్మపథం కార్యసిద్ధి అభయాంజనేయస్వామి దేవాలయంలో షిరిడీసాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం అభిషేకం, తోమాల సేవలతో ప్రత్యేక పూజలు జరిగాయి. రాత్రికి ఆలయ మండపంలో సామూహిక సత్యనారాయణ వ్రత వేడుకలు జరిగాయి. అలాగే మండలంలోని గండబోయనపల్లె గ్రామంలోని సత్యమ్మతల్లి దేవత ఆలయంలో పౌర్ణమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమాలలో సత్యమ్మ తల్లి ఆలయ చైర్మన్ పులి సత్యారెడ్డి, అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, ఉత్తన్న పాల్గొన్నారు.


శాకాంబరీ అలంకరణలో వరాలఆంజనేయస్వామి

మదనపల్లె అర్బన్‌లో: మదనపల్లె పట్టణంలో ఆదివారం పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక ముగ్గురాళ్ల వంకలో బోయకొండ గంగమ్మను ఆలయ కమిటీ సభ్యులు విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శిం చుకున్నారు. వరాల ఆంజనేయస్వామిని శాకాంబరీ అలంకరణ చేసి భక్తులకు ఆలయ కమిటీ దర్శనభాగ్యం కల్పించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం స్వామివారిని ప్రత్యేక వాహనంపై ఊరేగింపు నిర్వహించారు. పట్టణంలోని అనపగుట్ట, శ్రీవారినగర్, శ్రీకృష్ణ ఆలయంలో స్వామవారికి ఆలయకమిటీ సభ్యులు పౌర్ణమి పురస్కరించకుని ప్రత్యేకంగా అర్చనలు, అభిషే కాలు నిర్వహించారు. సాయంత్రం భక్తులు గిరిప్రదక్షణ చేశారు.

పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయం


పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘ సభ్యులు


అన్నదానం చేస్తున్న మదనపల్లె ఆర్యవైశ్య సంఘం నేతలు

మదనపల్లె అర్బన్/పీలేరు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి):తెలుగు జాతి కోసం ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయమని వక్తలు పేర్కొన్నారు. మదనపల్లె నీరుగట్టువారిపల్లె వివేకానంద మున్సిపల్ హైస్కూల్‌లో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆదివారం యూటీఎఫ్ నాయకుడు పురం వెంకటరమణ ఆధ్వర్యంలో పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే స్థానిక జడ్పీహైస్కూల్‌లో పొట్టిశ్రీరాములు వర్ధంతి సందర్భంగా మదనపల్లె ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు పూనగంటి ఓంప్రకాష్ ఆధ్వర్యంలో పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎంఈవో ప్రభాకర్‌రెడ్డి, హెచ్‌ఎం సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు. స్థానిక బాలికల జూనియర్ కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శివపార్వతదేవి ఆధ్వర్యంలో పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ పోగ్రామం ఆఫీసర్ రెడ్డెప్పరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా ఆదివారం పీలేరు పట్టణంలోని ఉపాధ్యాయులు, ఆర్యవైశ్య సంఘ సభ్యులు ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. స్థానిక సీఆర్‌సీలో ఆయన చిత్రపటాన్ని ఆవిష్కరించి ఎంఈవో లోకేశ్వర రెడ్డి, ఉపాధ్యాయులు ఆయన సేవలను స్మరించుకున్నారు. ఆర్యవైశ్య సంఘ సభ్యులు పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణకు ఆయన చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. ఆర్యవైశ్య సంఘ సభ్యులు దేవతి రవికుమార్, శరత్, సుధీర్ రేపూరి, శంకర, రెడ్డన్న, వీకే బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

కడప సదస్సుకు భారీగా తరలివెళ్లిన ముస్లింలు


జెండా ఊపి కడపకు వెళ్లే వాహనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరిరక్షణ, దేశ ప్రజల సమానత్వం కోసం అంటూ జమియత్ ఉలమా ఏ హింద్ పేరిట కడపలో నిర్వహించిన సదస్సుకు మదనపల్లె నుంచి భారీగా ముస్లింలు తరలి వెళ్లారు. ఆదివారం స్థానిక బెంగళూరు బస్టాండు నుంచి జమియత్ ఉలమా మదనపల్లె ఆధ్వర్యంలో పెద్దసంఖ్యలో మస్లీంలు పలు వాహనాల్లో బయలు దేరగా ఎమ్మెల్యే షాజహాన్‌బాషా జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో వక్ఫ్ ఆస్తులను సీఎం చంద్రబాబు పరిరక్షిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో ముస్లీంలు పాల్గొన్నారు.

గేట్‌వే సాఫ్ట్‌వేర్‌తో మిట్స్ ఒప్పందం


గేట్‌వే సాఫ్ట్‌వేర్‌తో ఒప్పందం కుదుర్చుకుంటున్న కళాశాల ప్రిన్సిపాల్

కురబలకోట, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగళ్ళు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం చెన్నైకు చెందిన గేట్‌వే సాఫ్ట్‌వేర్ పొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎంవోయూ ఒప్పందం కుదుర్చుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ యువరాజ్ పేర్కొన్నారు. కళాశాలలో సైబర్‌సెక్యూరిటీ విభాగం ఆధ్వర్యంలో వైస్‌ప్రిన్సిపాల్ రామనాథమ్, ఆ కంపెనీ వ్యవస్థాపకుడు శరవణముత్తుతో ఒప్పందం కుదుర్చుకున్నారు. దీని ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యతో, ఇంటర్నషిప్‌లు, ప్లేస్‌మెంట్, అందించడంతో పాటుగా అవగాహన కార్యక్రమాలలో సహాయసహకారాలు అందివ్వనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో విభాగాధిపతి గంగాదేవీ, ముత్తురసు, కనిష్క తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులు మొగ్గు చూపాలి

వాల్మీకిపురం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని జూనియర్ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ పవన్ రైతులకు సూచించారు. జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్ ఆదేశాల మేరకు ఆదివారం వాల్మీకిపురం మండలంలోని చింతలవారిపల్లె గ్రామంలో మామిడి రైతుకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు.. అనంతరం రైతుకు వెయ్యి కిలోలు ఘన జీవామృతం, 400లీటర్ల ద్రవ జీవామృతంను సామూహికంగా తయారు చేయించారు. ఈకార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సుబ్బరామయ్య, హేమలత, పెద్ద రెడ్డెయ్య, సిబ్బంది రైతులు, పాల్గొన్నారు.

సంతానలక్ష్మికి ప్రత్యేక పూజలు

గుర్రంకొండ, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి):గుర్రంకొండ మండలం చెర్లోపల్లె రెడ్డెమ్మకొండ ఆలయంలో ఆదివారం సంతానలక్ష్మి అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం అమ్మవారిని వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు వచ్చారు. అమ్మవారి కృపతో సంతానం పొందిన మహిళలు మొక్కులు తీర్చుకోవడానికి ఆలయానికి రావడంతో పరిసరాలు రద్దీగా మారాయి. ఈవో మంజుల, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.